నేటి కందం- నేటికి అందం

నేరుగ విజ్ఞానమ్మును
పారించుట కొరకు మాతృభాషయె మన కా
ధారమ్మని వార్థాలో
తీరుగ ప్రకటించె ద్రౌపదీ ముర్మూజీ !!

(రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మూ గారు వార్థాలో మాట్లాడుతూ మాతృభాషలో బోధన ద్వారానే విషయం నేరుగా అర్థం అవుతుందని వివరించారు.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: భైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

అంతా విధ్వంసం
ఐనంకా శాంతి బాట
వేదాలను దయ్యాలు
వల్లిస్తే కపట మాట
ఎవరి గెలుపీ యుద్ధం
ఎందుకొరకు నరమేధం
ఆయుధ వ్యాపారం
ఆడుతున్న ఈ జూదం

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ శనివారం 18-4-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:194 పేజీలు:6 వెల: రూ.1/-


## వీగిపోయిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:మహిళా రిజర్వేషన్ బిల్లులో ముడిపడిన మూడు బిల్లులపై సుదీర్ఘ చర్చ అనంతరం శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగింది. 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై ఈ ఓటింగ్ జరిగింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఓటింగ్‌లో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. మూడింట రెండొంతుల మెజారిటీకి అవసరమైన 326 ఓట్లను ఎన్డీయే సాధించలేకపోయింది. బిల్లుకు అనుకూలంగా 278, వ్యతిరేకంగా 211 ఓట్లు పడ్డాయి. మొత్తం ఓటింగ్‌లో 489 మంది పాల్గొన్నారు. కాగా, డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెనక్కి తీసుకున్నట్టు ప్రకటించారు.

## బీసీ కార్పొరేషన్ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు: పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, ఏప్రిల్ 17: బీసీ సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఈరోజు(శుక్రవారం) తెలంగాణ సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమయాదేవి , బీసీ గురుకులాల సెక్రెటరీ సైదులు , ఎండీ మల్లయ్య బట్టు, అలోక్ కుమార్ హాజరయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. బీసీ సంక్షేమ శాఖలో పెండింగ్ అంశాలపై ఈ సమీక్షా సమావేశంలో చర్చించామని పేర్కొన్నారు. బీసీ విదేశీ విద్యానిధికి సంబంధించి లబ్ధిదారుల ఎంపికపై సమావేశంలో మాట్లాడామని తెలిపారు.

బీసీ కార్పొరేషన్ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బీసీ గురుకులాల్లో ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించాలని నిర్ణయించామని అన్నారు. హాస్టళ్లు, గురుకుల పాఠశాలల అద్దెలు ఎప్పటికప్పుడు చెల్లించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరం సమయానికి విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్, బూట్లు చేరాలా చర్యలు చేపట్టాలని నిర్ణయించామన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. కాటమయ్య రక్షణ కవచాలను.. శిక్షణ ఇచ్చిన వారికి కిట్స్ అందజేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి: డీజీపీ శివధర్ రెడ్డి



సిద్దిపేట జిల్లా, ఏప్రిల్ 17 : రోడ్డు భద్రతపై ప్రజలకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి పలు కీలక సూచనలు చేశారు. రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గజ్వేల్ మహతి ఆడిటోరియంలో ఈరోజు(శుక్రవారం) 'అరైవ్ అలైవ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీజీపీ శివధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హైమావతి, కమిషనర్ రష్మీ పెరుమాళ్, ట్రైనీ ఐపీఎస్ ఆయేషా ఫాతిమా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడారు. మనల్ని మనం కాపాడుకుందామనుకునే లోపే ప్రమాదం జరిగిపోతుందని తెలిపారు. వాహనాలు లెఫ్ట్ సైడ్ నుంచి ఓవర్ టెక్ చేయడం చాలా తప్పు, ప్రమాదమని హెచ్చరించారు. వాహనాలకు ఎడమ వైపునకు మాత్రమే నడపాలని సూచించారు.

రైట్ సైడ్ నుంచి ఓవర్ టేక్ చేసిన తర్వాత తిరిగి లెఫ్ట్ సైడ్‌కి వచ్చేయాలని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. మీరే వాహనాన్ని నడపడమే కాదని.. ఎదుటి వారి డ్రైవింగ్‌ను కూడా పరిశీలించాలని చెప్పుకొచ్చారు. హైవే మీద వాహనంతో వెళ్లే వారికి మొదటి ప్రాధాన్యం ఉంటుందని అన్నారు. ఫోర్ వీలర్ నడిపే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. ఆటో డ్రైవర్లు ఖాకీ యూనిఫాం ధరించి ఈ కార్యక్రమానికి రావడం చాలా సంతోషించదగ్గ విషయమని అన్నారు. ఆటో వాళ్లు వారి గౌరవ ప్రతిష్ఠలను కాపాడుకోవాలని మార్గనిర్దేశం చేశారు. సమాజంలో మీ మీద గొప్ప నమ్మకం ఉందని తెలిపారు. రోడ్డు భద్రతలపై ఎక్కడి నుంచో వచ్చి తాము చెప్పాల్సిన అవసరం లేదన్నారు. మీకు మీరుగా బాధ్యత కలిగి ఉండాలని.. చేయి పోయినా, కాలు పోయినా సరిపెట్టుకోవచ్చు కానీ ప్రాణం పోతే తిరిగిరాదనే విషయాన్ని వాహనదారులు గుర్తుంచుకోవాలని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై మా ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదు: మంత్రి ఉత్తమ్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డికి, తమ ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 20వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మేడిగడ్డ బ్యారేజ్‌ను పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఈరోజు (శుక్రవారం) ఢిల్లీ వేదికగా మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులు, పునరుద్ధరణపై చర్చించామని తెలిపారు. గోదావరి వరదలు వచ్చేలోగా సాయిల్ టెస్టింగ్, డిజైన్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంపై కేసీఆర్ హయాంలో చేసిన పొరపాటు తెలంగాణ ప్రజలకు తెలుసునని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరాన్ని నిర్మించారని, అది కూలిపోయిందని అన్నారు. కాళేశ్వరంపై దాదాపు రూ.97 వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసి ఆ ప్రాజెక్టు నిర్మించారని తెలిపారు.

కాళేశ్వరంపై ప్రతి ఏడాది రూ.10వేల కోట్ల వడ్డీ కడుతున్నామని తెలిపారు. ప్రజాధనం ఉపయోగించడంతోనే దాన్ని ఎలా రిపేర్ చేయాలో ఆలోచించి ముందుకు వెళుతున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారని అన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళుతున్నామని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ డ్యామేజ్ సాయిల్ టెస్ట్, డిజైన్ల ఖర్చులను కాంట్రాక్ట్ సంస్థలే భరిస్తాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## డిప్యూటీ సీఎం భట్టి చర్చలు సఫలం..

### -సమస్యలను పరిష్కరించాలని ట్రాన్స్‌కో సీఎండీకి ఆదేశం..

### -ప్రభుత్వ నిర్ణయంపై ఆర్టిజన్ల హర్షం!



హైదరాబాద్, ఏప్రిల్ 17:గత కొద్దిరోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల కోసం ఆందోళన బాట పట్టిన విద్యుత్ శాఖ ఆర్టిజన్లు తమ సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో ఆర్టిజన్ల జేఏసీ నాయకులు జరిపిన చర్చలు విజయవంతం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఆర్టిజన్ల సమస్యలపై ప్రభుత్వం అత్యంత మానవీయ కోణంలో ఆలోచిస్తోందని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు. ఆర్టిజన్ల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని ఆయన ట్రాన్స్‌కో సీఎండీని ఆదేశించారు. ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడకుండా, మానవీయ కోణంలో తక్షణమే పరిష్కరించగలిగే అంశాలపై జేఏసీ నేతలతో చర్చలు జరపాలని ఉన్నతాధికారులకు సూచించారు. డిప్యూటీ సీఎం ఆదేశాలతో సమ్మె విరమిస్తున్నట్లు ఆర్టిజన్ల జేఏసీ చైర్మన్ సతీష్ రెడ్డి అధికారికంగా ప్రకటించారు. తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి, ఉన్నతాధికారులతో చర్చలకు మార్గం సుగమం చేసినందుకు డిప్యూటీ సీఎంకు జేఏసీ కన్వీనర్ సాయిలు మన స్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిర్ణయంతో విద్యుత్ శాఖలో నెలకొన్న సందిగ్ధత తొలగిపోయింది. త్వరలోనే ట్రాన్స్‌కో సీఎండీ ఆధ్వర్యంలో జరగబోయే చర్చల్లో తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని ఆర్టిజన్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## పాదయాత్ర ఇప్పుడెందుకు.. కవిత ప్రశ్నల వర్షం



హైదరాబాద్, ఏప్రిల్ 17: పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉందని.. పాదయాత్ర చేస్తానని మాజీ మంత్రి కేటీఆర్ (ఖఫీ) ఇప్పుడు ఎందుకు అంటున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత (ఐజీలతిబిష్ట్రజీ) ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉండి ఆయన ఎందుకు ప్రజల్లోకి పోలేదని నిలదీశారు. తెలంగాణలో అన్నివర్గాలకు అధికారం రావాలన్నదే తన ధ్యేయమని వ్యాఖ్యానించారు. అందరికీ అధికారమని మాట్లాడుతారని.. దీనిని ఆచరణలోకి తీసుకురావాలని తాను ప్రారంభించాకే తనకు కష్టాలు వచ్చాయని పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి పెట్టబోయే పార్టీకి మారోజు వీరన్న అనుచరులు, సీపీయూఎస్ఐ, దళిత బహుజన రాజ్యాధికార సంస్థ మద్దతు ఇచ్చారని తెలిపారు. ఈరోజు (శుక్రవారం) జాగృతి కార్యాలయంలో కవితను పలువురు కలిశారు. ఆమెను కలిసిన వారిలో సీపీయూఎస్ఐ కేంద్ర కమిటీ కార్యదర్శి కోదండం, రాష్ట్ర కార్యదర్శి వెంకన్న, దళిత బహుజన రాజ్యాధికార కన్వీనర్ గుడిపల్లి రవన్న, మారోజు వీరన్న సహచరులు కిషన్ నాయక్ సహా పలువురు నాయకులు ఉన్నారు. ఈసమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు.

సామాజిక తెలంగాణ సాధించే వరకు పోరాటం చేస్తా..

ప్రతి కష్టాన్ని పాఠంగా భావిస్తూ.. సామాజిక తెలంగాణ సాధించే వరకు పోరాటం చేస్తానని కవిత స్పష్టం చేశారు. సర్వోదయ తెలంగాణ తన లక్ష్యమని.. అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. మారోజు వీరన్న అనుచరుల మద్దతు ఎంతో శక్తిని ఇస్తుందని అన్నారు. తమతో మారోజు వీరన్న అనుచరులు కలవటమంటే ఇక తమను ఆపే శక్తే లేదని పేర్కొన్నారు. ఏదైనా శని ఉంటే.. అది తొలగిపోవడం కోసమే తాను వారణాసి వెళ్లి పూజలు చేశానని ప్రస్తావించారు. తాను పెట్టే పార్టీ సక్సెస్ కావాలని కోరుకున్నానని తెలిపారు. బీఆర్ఎస్‌కు చెందిన కొందరు మాజీ ఎమ్మెల్యేలు తనను కలిశారని.. పేర్లు మాత్రం తాను బయటకు చెప్పనని అన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్‌ను ముందుగా టార్గెట్ చేశానని తెలిపారు. తనను ఆ పార్టీ సస్పెండ్ చేసిందని కవిత ప్రస్తావించారు.

అందుకే కాంగ్రెస్‌ను టార్గెట్ చేశా..

ప్రజా సమస్యలను పరిష్కరించేది అధికార పార్టీనేనని.. అందుకే కాంగ్రెస్‌ను టార్గెట్ చేశానని కవిత తెలిపారు. ఆయా సమస్యల ఆధారంగా బీఆర్ఎస్‌పైన కూడా మాట్లాడుతానని అన్నారు. పరిగిలో రైతు దీక్షకు మద్దతు ఇచ్చేందుకు వెళ్తున్నానని చెప్పి.. హరీశ్‌రావు హౌస్ అరెస్ట్ అయ్యారని తెలిపారు. ఆ సమయంలో హరీశ్‌రావు ఫోన్ చేస్తే పోలీసులు ఆయన ఇంటికి వచ్చి హౌస్ అరెస్ట్ చేశారని విమర్శించారు. హరీశ్‌రావు పరిగిదాకా కూడా పోలేదని ఎద్దేవా చేశారు. తాము పరిగి వెళ్లి రైతులకు మద్దతుగా దీక్షలో పాల్గొన్నామని స్పష్టం చేశారు. పోలీసులు తమను అరెస్టు చేశారని.. రైతులకు మద్దతుగా తాము నిలిచామని తెలిపారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఏ విధంగానైతే పోరాటం చేశామో...అదే విధంగా పరిగిలో కూడా పోరాటం చేశానని వెల్లడించారు. భవిష్యత్తులో కూడా పోరాటం చేస్తానని కవిత పేర్కొన్నారు.

## హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరిచిన ఇరాన్.. అన్ని నౌకలకు అనుమతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:ప్రపంచానికి ఇది గుడ్‌న్యూస్. అందరూ ఎప్పుడెప్పుడు ఓపెన్ అవుతుందా అని ఎదురుచూసిన హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చీ ఈ మేరకు సోషల్ మీడియాలో దీనిపై శుక్రవారం ఒక ప్రకటన చేశారు. ఇకపై హోర్ముజ్ జలసంధి అందరికీ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇటీవలే అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య గురువారం కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. పది రోజులపాటు కాల్పుల విరమణ కొనసాగనుంది.

ఈ నేపథ్యంలోనే హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నంత కాలం జలసంధి తెరిచి ఉంచే అవకాశం ఉంది. "లెబనాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం అమలు నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నాం. ఈ ఒప్పందం అమలులో ఉన్నంతకాలం హోర్ముజ్‌ను అందరికీ అందుబాటులోకి తెస్తున్నాం. అన్ని రకాల వాణిజ్య నౌకల్ని అనుమతిస్తాం. ఈ అంశంపై ఇప్పటికే అన్ని పోర్టులకు సమాచారం అందించాం. సంబంధిత రూట్ల గురించి కూడా తెలియజేశాం" అని అరాగ్చీ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా స్పందించారు. హోర్ముజ్‌ను తెరిచేందుకు ఇరాన్ అంగీకరించిందని తన సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు.

## కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్‌పై ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్, ఏప్రిల్ 17:కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్‌పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అనీశ్రీ. పరిచిత్ మెహ్రా ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసింది. ఇంజినీర్లు, నిపుణులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. మూడు బ్యారేజీల మరమ్మతులకు సమన్వయ కమిటీ ఏర్పాటు చేసింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్ పనులు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

మాన్సూన్‌కు ముందే జియో టెక్నికల్ పరిశీలనలు పూర్తి చేయాలని తెలంగాణ సర్కార్ సూచించింది. మే 30వ తేదీలోగా పరిశీలనలు పూర్తిచేయాలని డెడ్‌లైన్ విధించింది. రోజువారీ పురోగతి నివేదికలు సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించింది. సీడబ్ల్యూసీ ఎన్డీఎస్ఏ అనుమతులతో పనులు, డిజైనింగ్ పునరుద్ధరణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. రోజువారీ యాక్షన్ ప్లాన్‌తో పనులు చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది

## ఇండి కూటమి సభ్యులు బిల్లును వ్యతిరేకించారు: అమిత్ షా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు మరో మూడు కీలక బిల్లులపై లోక్‌సభలో సుదీర్ఘ చర్చ ముగిసింది. ఈ సందర్భంగా అమిత్ షా ప్రతిపక్ష 'ఇండి' (ఎఔఆఎం) కూటమి లక్ష్యంగా ఘాటైన విమర్శలు చేశారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే చారిత్రాత్మక నిర్ణయాన్ని 'ఇండి' కూటమి సభ్యులు వ్యతిరేకించడం విచారకరమని అమిత్ షా అన్నారు.

మహిళా సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మద్దతు ఇవ్వకుండా అడ్డుకోవడం ఎందుకని అమిత్ షా కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాల్ని ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన మూడు బిల్లులకు మహిళా రిజర్వేషన్ల బిల్లుతో విడదీయలేని సంబంధం ఉందని ఆయన వివరించారు. ఈ ప్రక్రియ అంతా ఒక పద్ధతి ప్రకారం సాగుతోందని చెప్పారు.

నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకించడం అంటే.. ఎస్సీ , ఎస్టీ సీట్ల పెంపును వ్యతిరేకించడమేనని అమిత్ షా అన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వ్‌డ్ సీట్ల సంఖ్య పెరగాలంటే పునర్విభజన అనివార్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం వివిధ లోక్‌సభ నియోజకవర్గాల జనాభాలో తీవ్రమైన వ్యత్యాసాలు ఉన్నాయని, ప్రజాస్వామ్యబద్ధంగా అందరికీ సమాన ప్రాతినిధ్యం దక్కాలంటే పునర్విభజన అవసరమని అమిత్ షా నొక్కి చెప్పారు.

వచ్చే సాధారణ ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లు క్షేత్రస్థాయిలో అమలు చేసేలా మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తోందని అమిత్ షా ప్రకటించారు. సభలో ప్రస్తుతం 56 మంది మహిళా ఎంపీలు ఉండటం శుభపరిణామమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

## చిన్నారిని రక్షించిన సాహసవంతులకు సీపీ సజ్జనార్ సన్మానం



హైదరాబాద్, ఏప్రిల్ 17 : తొమ్మిదేళ్ల బాలికను కాపాడిన ముగ్గురు సామాన్య పౌరులను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఐపీఎస్ ప్రశంసించారు. చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న కామాంధుడిని ప్రాణాలకు తెగించి పట్టుకున్న సెజల్, గణపతి, కాశీనా

బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీపీ సజ్జనార్ ఈ ముగ్గురును శాలువాలతో సన్మానించి, ప్రశంసా పత్రాలతో పాటు నగదు రివార్డును అందజేశారు. 'వీరి సాహసం సమాజానికి ఒక గొప్ప సందేశమని ప్రశంసించారు. మహిళలు, చిన్నారుల రక్షణలో పౌరులు ఇలాగే అప్రమత్తంగా ఉంటే నేరాలను అరికట్టవచ్చని వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరూ 'ప్రజా పోలీస్'గా మారాలని సీపీ సజ్జనార్ సూచించారు.

ఈ సందర్భంగా గతంలో గోల్కొండలో ఎనిమిదేళ్ల బాలికను కాపాడిన మహ్మద్ ఫిరోజ్ ఉదంతాన్ని కూడా సీపీ సజ్జనార్ గుర్తు చేశారు. ప్రజల చైతన్యమే నేర నియంత్రణలో పోలీసులకు కొండంత అండ అని అభిప్రాయపడ్డారు. సమాజంలో ఏవైనా అనుమానాస్పద ఘటనలు లేదా నేరాలు జరుగుతున్నప్పుడు భయపడకుండా ఈ మార్గాల ద్వారా పోలీసులను సంప్రదించాలని సీపీ సజ్జనార్ సూచించారు. అత్యవసర సహాయం కోసం డయల్ 100 లేదా హైదరాబాద్ పోలీస్ వాట్సాప్ నంబర్ 94906 16555లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, జూబ్లీహిల్స్ ఎస్ఐ సోమ శేఖర్ తదితరులు పాల్గొని సాహస యువతను అభినందించారు.

# విపత్తులు, సంక్షోభాలతో వారసత్వ కట్టడాల మనుగడ ప్రశ్నార్థకం

## (18 ఏప్రిల్ " అంతర్జాతీయ స్మారక చిహ్నాలు - ప్రదేశాల దినోత్సవం" సందర్భంగా)

అంతర్జాతీయ మానవాళిని ఆకర్షిస్తున్న సహజ సిద్ధమైన లేదా మానవ నిర్మిత కట్టడాలు లేదా ప్రదేశాలను "వారసత్వ కట్టడాలు (హెరిటేజ్ స్ట్రక్చర్స్)" లేదా "స్మారక చిహ్నాలు (మాన్యుమెంట్స్)" లేదా" ప్రదేశాలు (సైట్స్)" అని పిలుస్తారు. అత్యంత పురాతన దేవాలయాల నుంచి అత్యద్భుత కట్టడాల వరకు అన్ని ప్రదేశాలు అనాదిగా మానవ నాగరికత చిహ్నాలుగా, గత వారసత్వ సంపద పునాదులుగా కొనసాగుతూనే ఉన్నాయి. వారసత్వ కట్టడాలు, ప్రదేశాలు మానవ సమాజ మానసిక ఆరోగ్య ప్రదాతలుగా, మానవాళి గత చరిత్రకు సాక్షాలుగా గంభీరంగా నిలబడి ఉన్నాయి. మన పునాదులను పటిష్ట పరుచుకోవడం, వాటి భద్రతకు నడుం బిగించడం నేటి ఆలోచనాపరమైన మానవాళి కర్తవ్యం. మనం నివసిస్తున్న ప్రదేశానికి ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. వాటిలో పురాతన కట్టడాలు, గత వైభవం కలిగిన దేవాలయాలు, అద్భుత సహజ ప్రకృతి ప్రదేశాలు, మనం సగర్వంగా చెప్పుకునే వారసత్వ కట్టడాలు ఉంటాయి.

### అంతర్జాతీయ స్మారక చిహ్నాలు-ప్రదేశాల దినోత్సవం :

మన వారసత్వ కట్టడాలు, ఆకర్షణీయ స్థలాల మనుగడ నేడు ప్రశ్నార్థకంగా మారడం, విపత్తులు/సంక్షోభాల విష వలయంలో చిక్కి విధ్వంసానికి గురి కావడం జరుగుతున్న వేళ, మన వారసత్వ నిర్మాణాలను కాపాడుకోవాలనే సదుద్దేశంతో "ఇంటర్నేషనల్ కైన్సిల్ ఆఫ్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్" సంస్థ చొరవతో పాటు యునెస్కో సౌజన్యంతో ప్రతి ఏట 18 ఏప్రిల్ రోజున ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ స్మారక చిహ్నాలు-ప్రదేశాల దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్)" లేదా " ప్రపంచ వారసత్వ దినోత్సవం (వరల్డ్ హెరిటేజ్ డే)" పాటించుట 1983 నుంచి కొనసాగుతున్నది. వారసత్వ కట్టడాలు, ఇతర ప్రజాదరణ పొందిన కట్టడాలు తరతరాలుగా మానవాళి విజ్ఞానాన్ని, వినోదాన్ని, మానసిక ప్రశాంతతను, పర్యాటకాన్ని అందిస్తూనే ఉన్నాయి. వీటిని అపురూపంగా కాపాడుకోవడం, వాటి పరిరక్షణకు అవసరమైన చర్యలను సత్వరమే తీసుకోవడం, మన సాంస్కృతిక వైభవ చిహ్నాలను సంరక్షించుకోవడం, వాటిని జాతీయ గుర్తింపు కలిగిన కట్టడాలుగా నిలబెట్టడం మన కనీస కర్తవ్యమని గమనించాలి.

### అంతర్జాతీయ స్మారక చిహ్నాలు-ప్రదేశాల దినోత్సవం-2026 ఇతివృత్తం:

ఇంటర్నేషనల్ కైన్సిల్ ఆఫ్ మాన్యుమెంట్స్ అండ్ సైట్స్ ఏర్పడి 60 ఏండ్లు పూరితి అవుతున్న శుభ గడియల్లో 2026 అంతర్జాతీయ స్మారక చిహ్నాలు-ప్రదేశాల దినోత్సవ ఇతివృత్తంగా "విపత్తులు, సంక్షోభాల నేపథ్యంలో వారసత్వ కట్టడాల పరిరక్షణ అత్యవసర చర్యలు" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రకృతి సహజ విపత్తులు, మానవ సాయుధ సంక్షోభాలు, వాతావరణ ప్రతికూల మార్పులతో మన వారసత్వ కట్టడాల ఉనికి ప్రమాదపు అంచున నిలుస్తున్న వేళ ప్రభుత్వాలు, సంస్థలు, వృత్తి నిపుణ కళాకారులు, పౌర సమాజం, యువత చేయి చేయి కలిపి మన గత ఘన చరిత్రను కాపాడుకోవడం విధిగా జరగాలి.

### యునెస్కో గుర్తింపు పొందిన వారసత్వ కట్టడాలు, ప్రదేశాలు:

ప్రపంచవ్యాప్తంగా యునెస్కో గుర్తింపు పొందిన వారసత్వ సంపదలు 1,092 ఉన్నాయి. వీటిలో అత్యధికంగా 845 సాంస్కృతిక, 209 సహజ, 38 మిశ్రమ కట్టడాలు లేదా ప్రదేశాలు ఉన్నాయి. ప్రపంచ దేశాల్లో అత్యధిక వారసత్వ కట్టడాల్లో ఇటలీలో 54, చైనాలో 53, స్పెయిన్‌లో 47, జర్మనీలో 44, ఫ్రాన్స్‌లో 44, ఇండియాలో 43 ఉన్నాయి. 2024లో భారతంలో 43వ యునెస్కో గుర్తింపు పొందిన కట్టడంగా అస్సాంలోని "మెయిడమ్ -అహోం రాజవంపు కట్టడం" జాబితాలో చేరింది. మన దేశంలోని యునెస్కో గుర్తింపు పొందిన 43 కట్టడాల్లో ముఖ్యమైనవిగా అజంతా గుహలు, ఎల్లోరా గుహలు, ఆగ్రా కోట, తాజ్‌మహల్, కోనార్క్ సూర్య దేవాలయం, మహాబలిపురం, కాజిరంగా నేషనల్ పార్క్, ఖజురాహో స్మారక చిహ్నం, ఫతేపూర్ సిక్రీ, కుతుబ్ మినార్, ఢిల్లీ ఎర్ర కోట, రామప్ప దేవాలయం, శాంతినికేతన్ లాంటివి ఉన్నాయి.

మన పునాదులను కాపాడుకుంటూ, గత వైభవ చిహ్నాల నుంచి ప్రేరణ పొందుతూ, వాచి నుంచి విజ్ఞానాన్ని జుర్రుకుంటూ, పర్యాటక ప్రదేశాలుగా తలచి మానసిక ప్రశాంతతను పొందుతూ భాద్యతాయుతంగా కొనసాగుదాం. మన వారసత్వ మనుగడను మనవే సంరక్షించుకుందాం.



-మధుపాళీ
9949700037

# వికసిత భారత్ సాకారం సహా నిర్ణయాత్మకతలో నారీశక్తికి భాగస్వామ్యం అవశ్యం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు లోక్‌సభనుద్దేశించి ప్రసంగించారు. ఈ ఉదయాన్నే కీలక బిల్లుపై చర్చ ప్రారంభాన్ని ఉటంకిస్తూ- అనేకమంది తన సహచరులు వాస్తవాల మేరకు తర్కబద్ధంగా కీలక సమస్యలను సమర్థంగా ప్రస్తావించారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

ఒక దేశ ప్రస్థానంలో అనేక కీలక ఘట్టాలు తటస్థిస్తాయని చెబుతూ- తదనుగుణంగా సామాజిక ధోరణి, నాయకత్వ సామర్థ్యం అవకాశాలను అందిపుచ్చుకుని, బలమైన జాతీయ వారసత్వాన్ని ప్రోదిచేస్తాయని ప్రధానమంత్రి గుర్తుచేశారుఏ. భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రస్తుత తరుణం కూడా అటువంటి చారిత్రక ఘట్టమేనని స్పష్టం చేశారు. నేటి ఈ ఆలోచన 25 నుంచి 30 ఏళ్ల కిందటే సాకారం కావాల్సిందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లుగా భారత్ గుర్తింపును ప్రముఖంగా ప్రస్తావిస్తూ- వేల ఏళ్లనాటి వారసత్వానికి ఓ సరికొత్త, సంస్కరణాత్మక శోభను జోడించే దిశగా సభ్యులందరికీ ఈ సభ ఒక శుభప్రదమైన అవకాశం ఇచ్చిందని ఆయన వ్యాఖ్యానించారు.

విధాన రూపకల్పనలో దేశ జనాభాలోని సగభాగాన్ని చురుకైన భాగస్వాములను చేయడం ఒక అద్భుత, విశేష అధికారమని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. ఈ కీలక అవకాశాన్ని జారవిడచుకోరాదని గౌరవనీయ పార్లమెంటు సభ్యులను ఆయన కోరారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత పరిణామాత్మక కృషిని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ- దేశ భవిష్యత్తుకు హామీ ఇవ్వడంలో భాగంగా పరిపాలన వ్యవస్థలో ప్రగాఢ అవగాహన నింపేందుకు భారతీయులంతా సమష్టిగా సన్నద్ధం అవుతున్నారని పేర్కొన్నారు. "మనమిప్పుడు ఓ కీలక మలుపులో మేధా మథనం చేస్తున్నాం... దీన్నుంచి ఆవిర్భవించే అమృతమే దేశం దశ, దిశలను నిర్ధారిస్తుంది" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

ప్రస్తుత 21వ శతాబ్దంలో భారత్ సరికొత్త ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేసుకోవడాన్ని ప్రస్తావిస్తూ- యావద్దేశం నేడు విస్తృత ప్రపంచ ఆమోదం పొందుతున్నదని ప్రధానమంత్రి చెప్పారు. ఇది వికసిత భారత్ సంకల్పంతో ముడిపడినది కావడం మనకెంతో గర్వకారణమని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన భారత్‌పై తన దృక్కోణం అత్యున్నత మౌలిక సదుపాయాలకు అతీతమన్నారు. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' మంత్రాన్ని విధాన రూపకల్పనలో అర్థవంతంగా ఏకీకృతం చేయాల్సిన ఆవశ్యకత ఎంతయినా ఉందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ మేరకు మన జనాభాలో 50 శాతమైన మహిళలను విధాన రూపకల్పనలో భాగస్వాములను చేయడం తక్షణావసరమని చెప్పారు. దీనికి సంబంధించి లోగడ జాప్యం చోటు చేసుకున్నప్పటికీ, తన విస్తృత వ్యక్తిగత సంప్రదింపుల సందర్భంగా ఈ బిల్లుపై ఏ ఒక్క పార్టీ నుంచీ సూత్రప్రాయంగానైనా వ్యతిరేకత రాలేదని పేర్కొన్నారు. వ్యక్తిగత రాజకీయ వ్యవస్థలకన్నా సామూహిక నిర్ణయాలే అంతిమంగా మన ప్రజాస్వామ్యానికి మేలు చేస్తాయన్నది చరిత్ర తేల్చిన సత్యమని చెప్పారు. ఈ ఘనత తనకు లేదా అధికార పక్షానికి కాకుండా మొత్తం సభకు దక్కుతుందని ఆయన స్పష్టం చేశారు. "అందువల్ల, దీనికి రాజకీయ రంగు పులమాల్సిన అవసరం ఏమాత్రం లేదన్నది నా అభిప్రాయం. ఎందుకంటే- దీనికి మద్దతు పలకడంలోనే ప్రతిఒక్కరి వాస్తవిక ప్రయోజనం ఇమిడి ఉంది" అని శ్రీ మోదీ ప్రకటించారు.

ప్రభుత్వాధినేతగా అధికార బాధ్యతలు చేపట్టడానికి ముందు సంస్థాగత కార్యకర్తగా తన గతాన్ని ప్రధానమంత్రి గుర్తుచేసుకున్నారు. పంచాయతీ స్థాయిలో రిజర్వేషన్లు సరళంగా మంజూరు కావడాన్ని ప్రశ్నిస్తూ- పార్లమెంటు ప్రాంగణంలో సాగిన చర్చలను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేసుకున్నారు. తమ పదవులు లేదా అధికారాన్ని కోల్పోతామనే భయం లేకపోవడం వల్లే పంచాయతీలలో కోటా మంజూరుకు నాయకులు సుముఖత ప్రకటించారని స్పష్టం చేశారు. అయితే, స్వప్రయోజనాలకు ముప్పు వాటిల్లే కోటాల అమలుపై ఉన్నతాధికారులలో పాతుకుపోయిన వైముఖ్యాన్ని ప్రస్తావిస్తూ- "పార్లమెంటుపై ఎలాంటి ప్రభావం చూపకుండా స్థానిక రిజర్వేషన్లు విజయవంతంగా 50 శాతానికి చేరుకోవడంలో ఈ రక్షణాత్మక ధోరణి దోహదం చేసింది" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

చారిత్రక మార్పులను తక్కువగా అంచనా వేయరాదని హెచ్చరిస్తూ- 25 లేదా 30 ఏళ్ల కిందటిలా కాకుండా మహిళల హక్కులపై వ్యతిరేకత రాజకీయ ఉపరితలం దిగువన నేడు లోతుగా ప్రతిధ్వనిస్తోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. నేడొక ప్రగాఢ రాజకీయ చైతన్యం పెల్లుబుకుతోందని, పంచాయతీ ఎన్నికలలో నెగ్గిన లక్షలాది మంది మహిళలు నిశ్శబ్ద పరిశీలకుల స్థాయి నుంచి అత్యంత వాగ్ధాటిగల క్షేత్రస్థాయి అభిప్రాయ రూపకర్తలుగా పరిణామం చెందారని ఆయన చెప్పారు. నేటి ఈ అనుభవజ్ఞులైన మహిళలు ప్రజా సమస్యలను తుదకంటా పరిష్కరించారని ప్రకటించారు. ఇకపై శాసనసభలు, పార్లమెంటు స్థాయిలో ప్రాథమిక నిర్ణయాత్మకత దిశగా తమ భాగస్వామ్యం కోసం తీవ్ర ఆందోళనతో డిమాండ్ చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ఆశావహులైన రాజకీయ నాయకులందదరూ ఈ మార్పును గుర్తించాలని సూచించారు. ఈ లక్షలాది మంది మహిళా నేతలు అన్ని నియోజకవర్గాలలో భవిష్యత్ ఎన్నికల ఫలితాలను ఇకపై శక్తిమంతంగా ప్రభావితం చేయగలరని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. దేశ మహిళల అవగాహనపై పూర్తి విశ్వాసం అవశ్యమని ప్రధానమంత్రి సభను కోరారు. ఈ చట్టంతో మహిళలకు 33 శాతం సభా ప్రాతినిధ్యం సాధించాక పితృస్వామ్య పర్యవేక్షణ అవసరం లేకుండానే వివిధ వర్గాలు, సమూహాలకు తదుపరి ఉప-కేటాయింపులను నిర్ణయించగల సామర్థ్యం కలిగి ఉంటారని పేర్కొన్నారు. తాను అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన వాడినని చెబుతూ- సమాజంలోని ప్రతి వర్గంతో భుజం కలిపి సాగడమే తన ప్రధాన రాజ్యాంగ కర్తవ్యమని ఆయన చెప్పారు. తనకు రాజ్యాంగమే సర్వోన్నతమని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. ఒక అణగారిన వ్యక్తి ఇంతటి బృహత్తర జాతీయ కర్తవ్యం నిర్వర్తించడానికి వీలు కల్పించిన శక్తి అదేనని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. "వారి సామర్థ్యాలపై మనకెందుకు సందేహం మహిళలే ముందడుగు వేసి, నిర్ణయించనివ్వండి" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

జీవితంలోని అన్ని రంగాల్లో అద్భుత విజయాలతో దేశ ప్రతిష్ఠను పెంచడంలో, దేశ పతాకాన్ని సగర్వంగా ఎగురవేయడంలో మహిళా శక్తి ఏమాత్రం వెనుకబడలేదని ప్రధానమంత్రి పేర్కొన్నారు. తల్లులు, సోదరీమణులు, కుమార్తెల అపార, విశిష్ట కృషితో యావద్దేశం గర్వంగా తలెత్తుకున్నదని ఆయన పేర్కొన్నారు. ఇంతటి అత్యంత సమర్థ వర్గాన్ని అడ్డుకోవడం కోసం పెను రాజకీయ శక్తిని వెచ్చించడంలో హేతుబద్ధతను ప్రశ్నించారు. శాసనసభలలో మహిళల చేరికతో యావద్దేశ సామర్థ్యం అనేక రెట్లు ఇనుమడిస్తుందని ఆయన సూచించారు. ఈ చారిత్రక చర్యను ఏదో ఒక ఎన్నికల లెక్కల ప్రాతిపదికన కాకుండా జాతీయ ప్రయోజనాల ఆధారంగా అంచనా వేయాలని ప్రధానమంత్రి చట్టసభ సభ్యులకు విస్పష్ట విజ్ఞప్తి చేశారు. "దీన్ని రాజకీయ త్రాసులో తూచరాదని మీకు నా విజ్ఞప్తి" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

నేటి తక్షణ కర్తవ్యాన్ని ప్రస్తావిస్తూ- వికసిత భారత్ సాకారంలో మహిళల భాగస్వామ్యాన్ని విశాల దృక్పథంతో సురక్షితం చేసే ప్రస్తుత అవకాశం ఏకీకృత ఆలోచనను అభిలషిస్తోందని ప్రధానమంత్రి అన్నారు. తుది శాసన నిర్ణయాన్ని యావదేశం విశ్లేషిస్తున్న నేపథ్యంలో మహిళా ఓటర్లు దాని వెనుకగల ఉద్దేశాలను మరింత నిశితంగా పరిశీలిస్తారని ఆయన పునరుద్ఘాటించారు. రాజకీయ దురుద్దేశం పరిణామాలపై చట్టసభను హెచ్చరిస్తూ, వారి ఉద్దేశపూర్వక తప్పిదం ఎలాంటిదైనా తీవ్ర వ్యతిరేకత తప్పదని పేర్కొన్నారు. "ఈ దేశంలోని నారీశక్తి మన ఉద్దేశాలలోని ఎలాంటి లోపాన్నీ, ఎన్నటికీ క్షమించదు" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

2023లో నూతన పార్లమెంటు భవనంలో ఈ చట్టాన్ని ఏకగ్రీవంగా, ఆనందంగా ఆమోదించిన విషయాన్ని గుర్తుచేస్తూ.. ఇది దేశవ్యాప్తంగా సానుకూల, నిష్పాక్షిక వాతావరణాన్ని నెలకొల్పిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. జనగణన డేటా, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై వస్తున్న ఆందోళనలపైనా ఆయన స్పందించారు. చరిత్ర మరవలేని కొన్ని ఘటనలు, కోవిడ్ విపత్తు సృష్టించిన భారీ అంతరాయాల వల్లే వీటి అమలులో జాప్యం జరిగిందని శ్రీ మోదీ వివరించారు. ఈ చట్టాన్ని సత్వరమే అమలు చేయాల్సిన ఆవశ్యకతను 2023లో జరిగిన విస్తృత చర్చలు స్పష్టం చేశాయని, కానీ 2024లోపే వాటిని అమలు చేయడం సాధ్యపడలేదని తెలిపారు. 2029లోనూ అవకాశాన్ని విడిచిపెట్టుకుంటే, అది ప్రజల విశ్వాసాన్ని శాశ్వతంగా దెబ్బతీసే అవకాశముందన్నారు. ఈ ప్రక్రియలో అంతులేని జాప్యం జరిగితే.. మహిళా సాధికారత పట్ల రాజకీయ వ్యవస్థ చిత్తశుద్ధితో ఉందన్న విషయమై వారికి విశ్వాసం కల్పించడం అసాధ్యమవుతుందన్నారు. రాజకీయ పార్టీలు, సామాజిక కార్యకర్తలతో సమగ్రమైన అధికారిక, అనధికారిక సంప్రదింపులను ఇప్పటికే నిర్వహించామన్న ఆయన.. ఒక ఆచరణాత్మకమైన మార్గాన్ని రూపొందించడానికి ఈ చర్చలు ఎంతో కీలకమని స్పష్టం చేశారు. "ఇక ఏమాత్రం ఆలస్యం చేయకపోవడమే ప్రస్తుత కాలం చేస్తున్న ఖచ్చితమైన డిమాండ్' అని మోదీ ఉద్ఘాటించారు. "ఈ విషయంలో ఇక ఎంతమాత్రమూ జాప్యం తగదు. ఈ చట్టం అత్యావశ్యకమైన తరుణమిది" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

రాజ్యాంగం నిర్దేశించిన విధులకు అందరూ కట్టుబడి ఉండాల్సిందేనన్నారు. దేశాన్ని ముక్కలుగా చూసే హక్కు గానీ, భౌగోళిక విభజనను ప్రోత్సహించే నిర్ణయాలు తీసుకునే అధికారం గానీ ఈ సభలో కూర్చున్న ఏ సభ్యుడికీ లేదని తేల్చిచెప్పారు. కాశ్మీర్ అయినా, కన్యాకుమారి అయినా.. ఒకే దేశంగా ఐక్యంగా వ్యవహరించాలనే పార్లమెంటు సభ్యుల పవిత్ర ప్రమాణ స్వీకారాలు నిర్దేశిస్తున్నాయన్నారు. పూర్తిగా అబద్ధాలతో సృష్టించిన రాజకీయ దుమారాన్ని తీవ్రంగా ఖండిచారు. కొత్త నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో ఏ రాష్ట్రంపైనా లేదా ఏ ప్రాంతంపైనా ఎట్టి పరిస్థితుల్లోనూ వివక్ష ఉండబోదని పవిత్ర సభా వేదిక సాక్షిగా స్పష్టం చేశారు. గత ప్రభుత్వాల హయాంలో నిర్ణయించిన జనాభా నిష్పత్తులను కచ్చితంగా పాటిస్తామని, ఎవరికీ నష్టం కలిగించకుండా న్యాయబద్ధంగా సీట్ల పెంపు జరుగుతుందని ప్రధానమంత్రి హామీ ఇచ్చారు. రాజకీయ ఉద్దేశాలతో కూడిన పద చమత్కారానికి, మాటల గారడీకి ఇందులో తావులేదన్నారు. తమిళంలోని ప్రాంతీయ పదాలు సహా, భరోసానిచ్చే బలమైన మాటల్లోనూ హామీ ఇచ్చేందుకు పూర్తిగా సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేస్తూ.. ప్రధానమంత్రి తన చిత్తశుద్ధిని చాటుకున్నారు.

# ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు జిల్లాలో రోడ్డు ప్రమాదం... విచారం వ్యక్తం చేసిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు జిల్లాలో రోడ్డు ప్రమాదం పట్ల ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు.

ఆప్తులను కోల్పోయిన వారికి ప్రధానమంత్రి సంతాపాన్ని తెలిపారు. ఈ దుర్ఘటనలో గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని ఆయన ప్రార్థించారు.

ప్రమాదంలో ప్రాణాలను కోల్పోయిన వారి సంబంధికులకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ఆర్ఎఫ్) నుంచి రూ. 2 లక్షల వంతున ఎక్స్‌గ్రేషియాను ప్రధానమంత్రి ప్రకటించారు. గాయపడ్డ వారికి రూ. 50,000 వంతున అందిస్తారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో ప్రధానమంత్రి కార్యాలయం ఇలా తెలిపింది:

"ఆంధ్రప్రదేశ్ లోని కర్నూలు జిల్లాలో రోడ్డు దుర్ఘటన అత్యంత బాధాకరం. ఈ ప్రమాదంలో ఆత్మీయులను కోల్పోయిన వారికి నేను సంతాపం తెలియజేస్తున్నాను. ఈ దుర్ఘటనలో గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను.

మృతుల బంధువులకు పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి రూ. 2 లక్షల వంతున ఎక్స్‌గ్రేషియాను అందిస్తారు. గాయపడ్డ వారికి రూ. 50,000 వంతున అందిస్తారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ".

# గుట్టపాడులో రూ.40 లక్షల నీటి డ్రైనేజీ ప్రాజెక్టుకు శ్రీకారం..



అమరావతి, ఏప్రిల్ 17:గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో అడుగు ముందుకేసిన జై రాజ్ ఇస్పాత్ లిమిటెడ్, కర్నూలు జిల్లాలోని గుట్టపాడు గ్రామంలో నీటి నిల్వ మరియు మురుగునీటి పారుదల ప్రాజెక్టును ప్రారంభించింది. భూగర్భ నీటి నిల్వ ట్యాంక్‌తో పాటు సమగ్ర డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టింది. దాదాపు రూ. 40 లక్షల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా గ్రామంలో నీటి లభ్యతను పెంపొందించడం, మురుగునీటి పారుదల సమస్యలను పరిష్కరించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనివల్ల పరిశుభ్రత ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు కూడా పెరుగుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం గ్రామంలో నీటి నిల్వ సామర్థ్యం తక్కువగా ఉండటం, మురుగునీటి పారుదల సదుపాయాలు పరిమితంగా ఉండటం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సమీకృత నీటి నిల్వ వ్యవస్థతో పాటు శాస్త్రీయ డ్రైనేజీ నిర్మాణం చేపట్టడం ద్వారా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, స్థానిక అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ప్రాజెక్టు అమలులో నాణ్యత, మన్నికకు ప్రాధాన్యం ఇస్తూ దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించేలా పనులు చేపడతా మని తెలిపారు. ఈ సందర్భంగా జై రాజ్ ఇస్పాత్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.కె. గోయెంకా మాట్లాడుతూ, ఆరోగ్య కరమైన సమాజ నిర్మాణానికి నీటి, పారిశుధ్య మౌలిక సదుపాయాలు అత్యవసరమని పేర్కొన్నారు.

ఈ ప్రాజెక్టు గ్రామస్థుల రోజువారీ జీవన పరిస్థితులను మెరుగుపరచడమే కాకుండా, భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడే విధంగా ఉండాలని లక్ష్యంగా పెట్టకున్నామని తెలిపారు. కంపెనీ డైరెక్టర్ రాజశ్రీ జైన్ మాట్లాడుతూ, తక్షణ అవసరాలను తీర్చడమే కాకుండా, దీర్ఘకాలిక సుస్థిరతను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్టును రూపొందించామని చెప్పారు. స్థానిక మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం ద్వారా సమాజ అభివృద్ధికి తోడ్పడటమే తమ లక్ష్యమని వివరించారు. మొత్తం గా, గుట్టపాడు గ్రామంలో చేపట్టిన ఈ ప్రాజెక్టు గ్రామీణ మౌలిక సదుపాయాల బలోపేతానికి దోహదం చేయడంతో పాటు, పరిశుభ్రత, నీటి నిర్వహణలో కొత్త మారదర్శకంగా నిలవనుంది.

# భార్య కాలు నరికిన భర్త


అమరావతి, ఏప్రిల్ 17: పల్నాడు జిల్లాలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. భార్యపై అనుమానంతో భర్త అమానుషంగా దాడి చేసి ఆమె కాలును నరికిన సంఘటన సంచలనం సృష్టించింది.

పల్నాడు జిల్లా తొండపిలో ఘోర ఘటన వెలుగులోకి వచ్చింది. భార్యపై అనుమానం పెంచుకున్న లక్ష్మయ్య అనే వ్యక్తి తన భార్య భూలక్ష్మీపై గొడ్డలితో దాడి చేసి ఆమె కాలును నరికాడు.

ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన భూలక్ష్మి ప్రాణాపాయ స్థితిలో ఉండగా, వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇక నరికిన కాలును సంచిలో వేసుకుని లక్ష్మయ్య స్వయంగా పోలీసుల ముందు లొంగిపోవడం మరింత కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

తన భార్యకు వేరే వారితో వివాహేతర సంబంధం ఉన్నదన్న అనుమానంతో భర్త గొడ్డలితో ఆమె కుడికాలును నరికి వేశాడు. ఈ ఘటన పల్నాడు జిల్లా, ముప్పాళ్ళ మండలం, తొండపి గ్రామంలో గురువారం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి ముప్పాళ్ళ ఎస్సై కె అనిల్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తొండపి గ్రామంలోని వడ్డెర కాలనీకి చెందిన వల్లెపు లక్ష్మయ్యకు తన భార్య భూలక్ష్మి పై అనుమానం ఏర్పడింది. ఆమెకు వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందన్న అనుమానం లక్ష్మయ్యను వెంటాడుతుంది. ఈ నేపథ్యంలో గురువారం భార్యా, భర్తల మధ్య గొడవ జరిగింది. వారి మధ్య జరిగిన గొడవ కాస్త ముదిరి, కట్టెలు నరికే గొడ్డలితో భూలక్ష్మి రెండు కాళ్లపై విచక్షణారహితంగా భర్త లక్ష్మయ్య దాడి చేశాడు. ఈ దాడిలో కుడి కాలు మనికట్టు వరకు భూలక్ష్మి కోల్పోవడం జరిగింది.

ఈ సమాచారం అందుకున్న స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే భూలక్ష్మిని అంబులెన్స్ లో గుంటూరు గవర్నమెంట్ హాస్పిటల్ కు పంపించడం జరిగింది. ఆమెను పరీక్షించిన వైద్యులు ప్రాణాపాయం ప్రస్తుతానికి లేదని తెలిపారు.

# ఈ నెల 17న ముంబయిలో 15వ వాణిజ్య బొగ్గు గనుల వేలాన్ని, భాగస్వాములతో సంప్రదింపులను నిర్వహించనున్న బొగ్గు మంత్రిత్వశాఖ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:వాణిజ్య బొగ్గు గనుల 15వ విడత వేలంతో పాటుగా, "ఆత్మనిర్భర భారత్: ఇంధన భద్రత కోసం బొగ్గు" అంశంపై ఈ రంగంలోని నిపుణులతో సంప్రదింపులను 2026 ఏప్రిల్ 17న బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్వహించనుంది. ముంబయిలో జరిగే ఈ కార్యక్రమానికి బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ విక్రమ్ దేవ్ దత్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. పెరుగుతున్న దేశ ఇంధన అవసరాలకు మద్దతును అందించడంలో, ఆత్మనిర్భర భారత్ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో మంత్రిత్వ శాఖ చిత్తశుద్ధిని ఈ కార్యక్రమం ప్రతిబింబిస్తుంది.

వాణిజ్య గనుల వేలం సాధించిన విజయం ఆధారంగా వృద్ధి, సామర్థ్యం, స్వావలంబనపై దృష్టి సారిస్తూ... దేశ ఇంధన రంగాన్ని బొగ్గు మంత్రిత్వ శాఖ బలోపేతం చేస్తోంది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ నాయకత్వంలో 2020లో వాణిజ్య బొగ్గు తవ్వకాలను ప్రారంభించినప్పటి నుంచి దేశీయంగా బొగ్గు లభ్యత పెరిగింది. జాతీయ ఇంధన భద్రత బలోపేతమైంది.

త్వరలో నిర్వహించే 15వ విడత వేలం కూడా ఈ పురోగతిని కొనసాగిస్తుంది. అలాగే వ్యాపార సౌలభ్యాన్ని ప్రోత్సహించడానికి, మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడానికి, పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి అత్యంత ఉదారమైన నిబంధనలతో బొగ్గు గనులను అందిస్తోంది. పూర్తిగా, పాక్షికంగా అన్వేషించిన బొగ్గు గనులను ఈ దఫాలో వేలం వేస్తారు.

అనుభవజ్ఞులైన గనుల తవ్వకందారులు, ఈ రంగంలోకి కొత్తగా ప్రవేశించినవారు, సాంకేతిక పరిజ్ఞానంతో నడిచే సంస్థలను ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానిస్తున్నారు. ఇది మరింత శక్తిమంతమైన, పోటీతత్వం నిండిన వ్యవస్థను ఏర్పాటు చేసి బొగ్గు రంగాన్ని మరింత బలోపేతం చేస్తుందని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో పెట్టుబడుల విస్తరణకు, ఉపాధి కల్పనకు, ఈ రంగం సమగ్రాభివృద్ధికి మార్గం సుగమం చేస్తుందని భావిస్తున్నారు.

పారదర్శకతను, పోటీతత్వాన్ని, అందరికీ సమాన అవాశాలను కల్పించడం ద్వారా వాణిజ్య బొగ్గు గనుల వేలం విధానం బొగ్గు రంగంలో మార్పులను తీసుకువచ్చింది. ఇది దేశీయ పరిశ్రమలకు బొగ్గు లభ్యతను గణనీయంగా పెంచింది. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి ఆత్మనిర్భర భారత్ లక్ష్యానికి తోడ్పాటునందించింది.

ఆర్థిక ప్రగతిలో కీలకమైన విధానంగా వాణిజ్య బొగ్గు గనుల తవ్వకం నిలిచింది. ఇది బొగ్గు ఉత్పత్తిని పెంచి, దేశవ్యాప్తంగా ఉన్న పరిశ్రమలకు స్థిరంగా, విశ్వసనీయంగా సరఫరా చేస్తోంది. ఈ బలమైన పునాదిపై ఆధారపడే రాబోయే విడత వేలం జరుగుతుంది. తద్వారా ఈ రంగంపై, దాని భవిష్యత్తు సామర్థ్యంపై విశ్వాసాన్ని మరింత పెంపొందిస్తుంది. దేశానికి విశ్వసనీయమైన, సరసమైన ఇంధనాన్ని అందించేందుకు బొగ్గు మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉంది. అలాగే ఈ రంగంలో సుస్థిరాభివృద్ధి, ఆవిష్కరణ, దీర్ఘకాల స్థిరత్వాన్ని ప్రోత్సహిస్తుంది.

# చిత్తూరు వన్‌టౌన్ సీఐ మహేశ్వర సస్పెన్షన్

అమరావతి, ఏప్రిల్ 17: చిత్తూరు నగరంలో సంచలనం సృష్టించిన పరిణామంలో వన్‌టౌన్ సీఐ మహేశ్వరపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుల నుంచి లక్షల రూపాయలు మామూళ్లు వసూలు చేసినట్టు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయనను సస్పెండ్ చేస్తూ అనంతపురం ఐజీ షిమోషి ఆదేశాలు జారీ చేశారు. ఈ వ్యవహారంపై చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ సమగ్ర నివేదికను ఐజీకి అందించడంతో ఈ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది.

పోలీసు వర్గాల సమాచారం మేరకు, చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్ల ద్వారా బెట్టింగ్ రాయుళ్ల నుంచి సీఐ మహేశ్వర భారీ మొత్తంలో వసూళు జరిపించినట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా ఐపీఎల్ సీజన్‌కు ముందే నగరంలోని బెట్టింగ్ నిర్వాహకులను పిలిపించి, వారి కార్యకలాపాలపై వివరాలు సేకరించి, వాటాలో భాగంగా లక్షల రూపాయలు తీసుకున్నట్లు ప్రచారం సాగుతోంది.

ఇదిలా ఉండగా, జిల్లాలో క్రికెట్ బెట్టింగ్, లాటరీ వంటి అక్రమ కార్యకలాపాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఎస్పీ తుషార్ డూడీ పలు సందర్భాల్లో హెచ్చరిస్తూ వచ్చారు. ఈ క్రమంలోనే ఇటీవల పోలీసులు విస్తృత దాడులు నిర్వహించి సుమారు 16 మందిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారిలో ఏడుగురిపై కేసులు నమోదు చేయడం జరిగింది. ఈ దాడుల అనంతరం సీఐ వ్యవహారశైలిపై అనుమానాలు మరింత బలపడడంతో ఉన్నతాధికారులు దర్యాప్తు చేపట్టి సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నారు.

సీఐ మహేశ్వరపై ఇదే మొదటి ఆరోపణ కాదని తెలుస్తోంది. గతంలో నగరిలో విధులు నిర్వహిస్తున్న సమయంలో గుట్కా వ్యాపారుల నుంచి భారీగా వసూళ్లు చేసినట్టు ఆరోపణలు రావడంతో అప్పటి ఎస్పీ మణికంఠ నివేదిక సమర్పించిన విషయం కూడా ప్రస్తావనకు వస్తోంది. అదేవిధంగా ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఫిర్యాదు మేరకు ఆయనను లూప్‌లైన్‌కు బదిలీ చేసి, అనంతరం మళ్లీ వన్‌టౌన్ సీఐగా నియమించారు.

తాజా పరిణామాలతో చిత్తూరు పోలీసు శాఖలో కలకలం రేగింది.

# డిమాండ్ల సాధనకు నల్లబెల్లిలో నిరసన జ్వాల

**-డిమాండ్ల సాధనకు నల్లబెల్లిలో నిరసన జ్వాల**

**-పీఆర్‌సీ సహా సమస్యల పరిష్కారానికి నల్ల బ్యాడ్జీలతో ధర్నా తహసిల్దార్‌కు వినతి**




అమరావతి, ఏప్రిల్ 17: తెలంగాణ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆపరిష్కృత సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు నల్లబెల్లి మండలంలో నిరసన కార్యక్రమం జరిగింది. టీజీఈజెఏసీ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో తహసిల్దార్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జూన్ 2లోగా పీఆర్‌సీ అమలు చేయాలని, పెండింగ్ బిల్లులను రెండు విడతల్లో చెల్లించాలని,మే 1 నుంచి హెల్త్ కార్డు అమలు చేయాలని, సీపీఎస్ రద్దు చేసి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసిల్దార్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మండలానికి చెందిన వంద మందికి పైగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గుట్టపాడులో రూ.40 లక్షల నీట డ్రైనేజీ ప్రాజెక్టుకు శ్రీకారం..

అమరావతి, ఏప్రిల్ 17:గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో అడుగు ముందుకేసిన జై రాజ్ ఇస్పాత్ లిమిటెడ్, కర్నూలు జిల్లాలోని గుట్టపాడు గ్రామంలో నీటి నిల్వ మరియు మురుగునీటి పారుదల ప్రాజెక్టును ప్రారంభించింది. భూగర్భ నీటి నిల్వ ట్యాంక్‌తో పాటు సమగ్ర డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టింది. దాదాపు రూ.40 లక్షల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టు ద్వారా గ్రామంలో నీటి లభ్యతను పెంపొందించడం, మురుగునీటి పారుదల సమస్యలను పరిష్కరించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనివల్ల పరిశుభ్రత ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు కూడా పెరుగుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




ప్రస్తుతం గ్రామంలో నీటి నిల్వ సామర్థ్యం తక్కువగా ఉండటం, మురుగునీటి పారుదల సదుపాయాలు పరిమితంగా ఉండటం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సమీకృత నీటి నిల్వ వ్యవస్థతో పాటు శాస్త్రీయ డ్రైనేజీ నిర్మాణం చేపట్టడం ద్వారా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, స్థానిక అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ప్రాజెక్టు అమలులో నాణ్యత, మన్నికకు ప్రాధాన్యం ఇస్తూ దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించేలా పనులు చేపడతామని తెలిపారు. ఈ సందర్భంగా జై రాజ్ ఇస్పాత్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.కె. గోయెంకా మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి నీటి, పారిశుధ్య మౌలిక సదుపాయాలు అత్యవసరమని పేర్కొన్నారు.

ఈ ప్రాజెక్టు గ్రామస్థుల రోజువారీ జీవన పరిస్థితులను మెరుగుపరచడమే కాకుండా, భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడే విధంగా ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కంపెనీ డైరెక్టర్ రాజశ్రీ జైన్ మాట్లాడుతూ, తక్షణ అవసరాలను తీర్చడమే కాకుండా, దీర్ఘకాలిక సుస్థిరతను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్టును రూపొందించామని చెప్పారు. స్థానిక మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం ద్వారా సమాజ అభివృద్ధికి తోడ్పడటమే తమ లక్ష్యమని వివరించారు. మొత్తంగా, గుట్టపాడు గ్రామంలో చేపట్టిన ఈ ప్రాజెక్టు గ్రామీణ మౌలిక సదుపాయాల బలోపేతానికి దోహదం చేయడంతో పాటు, పరిశుభ్రత, నీటి నిర్వహణలో కొత్త మార్గదర్శకంగా నిలవనుంది.

# రాంపూర్‌లో చలివేంద్రం ఏర్పాటు..

అమరావతి, ఏప్రిల్ 17:వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు రాంపూర్ గ్రామ పంచాయితీ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేశారు, గ్రామస్తులు, ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు,కట్టెకోల భద్రమ్మ, నారాయణ గౌడ్ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు కట్టెకోల సోమన్న గౌడ్ ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు,ప్రస్తుతం ఈ సదుపాయం ద్వారా గ్రామ ప్రజలతో పాటు ప్రయాణికులు కూడా చల్లని తాగునీటిని సులభంగా పొందు తున్నారు,ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ సోమన్న గౌడ్ చేసిన సేవను అభినందించారు,తల్లి దండ్రుల జ్ఞాపకార్థం సమాజానికి ఉపయోగపడే కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు,రాంపూర్ సర్పంచ్ పురం భాస్కర్, గ్రామ పంచాయితీ కార్యదర్శి రంజిత్ కుమార్ మాట్లాడుతూ వేసవి కాలంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ వంతుగా సేవా కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు,

# ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద ఏర్పాటు చేసిన ఉప్పునీటి ఆక్వాకల్చర్ క్లస్టర్ పురోగతిని సమీక్షించేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరాన్ని సందర్శించిన కేంద్ర మత్స్యశాఖ కేంద్ర కార్యదర్శి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) కింద ఏర్పాటు చేసిన ఉప్పునీటి ఆక్వాకల్చర్ క్లస్టర్ పురోగతిని పర్యవేక్షించేందుకు ఏప్రిల్ 16న కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ అభిలక్ష్ లిఖి ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన స్థానిక రొయ్యల, చేపల రైతులను స్వయంగా కలిసి మాట్లాడారు. క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సవాళ్లు, వసతుల కొరతను అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షా సమావేశం హైబ్రిడ్ విధానంలో జరిగింది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మత్స్యశాఖ అధికారులు, వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మత్స్య క్లస్టర్ ప్రతినిధులు, ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. వీరితో పాటు ఎన్ఎఫ్‌డీబీ, సీఏఏ, ఎంపీఈడీఏ, నాబార్డ్ వంటి సంస్థల ప్రతినిధులు, చేపల, రొయ్యల రైతులు, మత్స్య సహకార సంఘాలు, సముద్ర ఆహార ఎగుమతిదారులు, మత్స్య విశ్వవిద్యాలయాలు, కళాశాలల ప్రతినిధులు ఈ చర్చా వేదికలో భాగస్వాములయ్యారు.

చేపల పెంపకందారులతో కేంద్ర మత్స్యశాఖ కార్యదర్శి డాక్టర్ అభిలక్ష్ లిఖి మాట్లాడారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న వారందరినీ ఆయన అభినందించారు. రైతులు ఇచ్చిన విలువైన అభిప్రాయాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధాన రూపకల్పనకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. సుమారు 64 లక్షల టన్నుల చేపల ఉత్పత్తిని సాధించి, ఆక్వా రంగంలో అగ్రగామిగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. భీమవరం క్లస్టర్‌కు కేంద్రం నుంచి నిరంతర మద్దతు ఉంటుందని తెలిపారు. ఉత్పత్తికి ముందు, ఉత్పత్తి సమయంలో, ఉత్పత్తి తర్వాత ఎదురయ్యే అన్ని రకాల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. చేపల వినియోగాన్ని పెంచేందుకు రక్షణ శాఖ, ఇతర ప్రభుత్వ సంస్థలతో ఒప్పందాలు చేసుకోవాలని సూచించారు. మన రైతులు కొత్త విషయాలు నేర్చుకోవడానికి దేశ విదేశాల్లో పర్యటించేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. చేపల్లో ఏ భాగాన్ని వృధా చేయకుండా సంపూర్ణ వినియోగ విధానాన్ని అవలంబించాలని, చేపల వ్యర్థాల నిర్వహణతో సహా ఐస్‌లాండ్ దేశంతో కుదుర్చుకోబోయే త్రైపాక్షిక ఒప్పందం గురించి వివరించారు. అత్యాధునిక సాంకేతికత, ఉత్తమ సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు భీమవరంలో సీఐబీఏ ఆధ్వర్యంలో ఒక అవగాహన సదస్సును ఏర్పాటు చేయాలని సూచించారు. రొయ్యలు, చేపల ఎగుమతులను పెంచడానికి మార్కెట్ సంబంధాలను బలోపేతం చేయాలని.. ధ్రువీకరణ, ట్రేసబిలిటీపై రైతులకు అవగాహన కల్పించాలని ఎంపీఈడీఏ ను కోరారు. భీమవరం క్లస్టర్ అభివృద్ధి కోసం ఈ రంగంలోని అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ బి. రాజశేఖర్ మాట్లాడుతూ.. దేశ సముద్ర ఆర్థిక వ్యవస్థకు మత్స్య రంగం కేంద్ర బిందువు అని, స్థిరమైన వృద్ధిని సాధించడంలో, ఎగుమతి ఆదాయాన్ని పెంచడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్లో నిలబడాలంటే ట్రేసబిలిటీ, ప్రపంచ ప్రమాణాలను పాటించడం ఇప్పుడు పాటించడం ఐచ్ఛికం కాదని, అవి తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న విస్తారమైన తీరప్రాంతం, సముద్ర వనరులను దృష్టిలో ఉంచుకుని, సముద్రపు నాచు సాగు, కృత్రిమ సముద్ర దిబ్బల ఏర్పాటులో పెట్టుబడులు పెంచాలని పిలుపునిచ్చారు. ఇవి ఎగుమతుల అభివృద్ధికి, వనరుల సుస్థిరతకు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.

కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల మంత్రిత్వ శాఖ (అంతర్గత మత్స్యశాఖ) సంయుక్త కార్యదర్శి శ్రీ సాగర్ మెహ్రా మాట్లాడుతూ.. ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెట్ సంబంధాలు, ఎగుమతుల వరకు అన్నింటినీ అనుసంధానిస్తూ.. దేశవ్యాప్తంగా 34 మత్స్య క్లస్టర్లను అభివృద్ధికి ప్రధాన కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం ఐఓటీ, బయోఫ్లాక్, ఆర్ఏఎస్ వంటి ఆధునిక సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని సూచించారు. శీతలీకరణ సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు, మత్స్య మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి, కిసాన్ క్రెడిట్ కార్డువంటి పథకాలను మార్కెట్ వ్యవస్థతో అనుసంధానించి, రైతులకు రుణ సదుపాయం అందడంలో ఉన్న అడ్డంకులను తొలగించాలని తెలిపారు.

ప్రపంచంలోనే చేపల ఉత్పత్తిలో భారత్ రెండో స్థానంలో ఉందని ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (మత్స్య శాస్త్రం) డాక్టర్ జేకే జెనా తెలిపారు. జాతీయ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అందిస్తున్న సహకారాన్ని ఆమె అభినందించారు. సీఐబీఏతో సహా ఐసీఏఆర్ సంస్థలు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, పర్యవేక్షణ కార్యక్రమాల ద్వారా పూర్తి మద్దతు ఇవ్వడం ద్వారా భీమవరం క్లస్టర్ దేశంలోనే అగ్రగామి ఆక్వాకల్చర్ జోన్‌గా ఎదిగే అవకాశం ఉందని తెలిపారు. భవిష్యత్తులో ఈ రంగం సుస్థిరంగా ఎదగాలంటే రైతులు, పరిశోధనా సంస్థలు, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వాముల మధ్య బలమైన సమన్వయం అవసరమని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ మత్స్యశాఖ కమిషనర్ శ్రీ రామశంకర్ నాయక్ మాట్లాడుతూ... అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, విలువ ఆధారిత సముద్రపు ఉత్పత్తులను ప్రోత్సహించడం ద్వారానే రైతుల ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. సాగు నీటి నాణ్యతను కాపాడటానికి, వ్యాధుల ప్రభావాన్ని తగ్గించి ఉత్పాదకతను పెంచడానికి ఉప్పునీటి కాలువలు, డ్రైనేజీ వ్యవస్థల్లో పూడికతీత, శుభ్రపరచడం వంటి పనులు అత్యంత కీలకమని తెలిపారు. ఉత్తమ ఆక్వా సాగు పద్ధతులను పాటించాలని, మత్స్య రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటు, ప్రయోగశాల సౌకర్యాల కల్పన అవసరమని తెలుపుతూ.. రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గించేందుకు ఏరేటర్లపై జీఎస్టీని తగ్గించాలని ఆయన కోరారు.

భీమవరం క్లస్టర్ కోసం రాబోయే పంచవర్ష ప్రణాళికపై జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ బిజయ్ కుమార్ బెహెరా ప్రజెంటేషన్ ఇచ్చారు. విలువ ఆధారిత వ్యవస్థలోని భాగస్వాములందరి నుంచి ఆశిస్తున్న అంశాలను ఆయన ప్రస్తావించారు.

సాంకేతికత, మౌలిక సదుపాయాలు, మార్కెట్ ఆధారిత చర్యల ద్వారా భీమవరం మత్స్య క్లస్టర్‌ను బలోపేతం చేయడంపై కీలక భాగస్వాములు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. హేచరీ (చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం), జన్యు మెరుగుదల సాంకేతికతలలో పురోగతి, సమీకృత రొయ్యలు-సముద్రపు నాచు సాగు నమూనాలు, మెరుగైన జీవ-భద్రతతో కూడిన అత్యధిక సాంద్రత గల రొయ్యల పెంపకం, వ్యాధి నిఘా, ట్రేసబిలిటీ వ్యవస్థలు, చేపల వ్యర్థాల వినియోగంలో సాధించిన పురోగతిని సీఐబీఏ వివరించింది. ఎగుమతులకు మద్దతుగా భీమవరంలో ఒక ప్రాంతీయ కార్యాలయం, రెండు పరీక్షా ప్రయోగశాలల ఏర్పాటుతో పాటు, ధ్రువీకరణ, ట్రేసబిలిటీపై క్రమం తప్పకుండా రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాల గురించి ఎంపీఈడీఏ పేర్కొంది. క్లస్టర్లలో మత్స్య రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటులో సాధించిన పురోగతిని, ఆర్థిక సమ్మిళితాన్ని మెరుగుపరచడానికి ప్రాంతీయ బ్యాంకులతో రుణ సంబంధాలను బలోపేతం చేయడం వంటి అంశాలను నాబార్డ్ వివరించింది. కీలకమైన ఉప్పునీటి జాతుల కోసం హేచరీ సాంకేతికతల అభివృద్ధి, సముద్రపు నాచు విలువ ఆధారిత ఉత్పత్తులపై చేపట్టిన కార్యక్రమాలు, కృత్రిమ దిబ్బల ఏర్పాటు, బహుళ జాతుల ఆక్వాకల్చర్, నర్సరీలు, బతికున్న చేపల రవాణాను ప్రోత్సహించడానికి అవసరమైన మౌలిక సదుపాయాల మద్దతు వంటి అంశాలను సీఎంఎఫ్ఆర్ఐ తెలిపింది.

ఈ సమావేశంలో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద అందుతున్న ప్రత్యక్ష మద్దతును చేపల రైతులు అభినందించారు. అయితే ప్రత్యేక దృష్టి సారించాల్సిన పలు సవాళ్లను వారు ప్రస్తావించారు. బలహీనమైన మార్కెట్ అనుసంధానం, దేశీయ వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం వంటి కీలక ఆందోళనలను వ్యక్తం చేశారు. ప్రభుత్వ క్యాంటీన్లు, ఆసుపత్రులు, మధ్యాహ్న భోజన పథకాల్లో చేపలు, సముద్రపు ఆహారాన్ని చేర్చాలని సూచించారు. వ్యాధులు, వైరస్ ల వ్యాప్తిని నిరోధించడానికి బ్రూడ్‌స్టాక్, విత్తన నాణ్యతపై కఠినమైన నియంత్రణ, పర్యవేక్షణ ఉండాలని రైతులు చెప్పారు. వ్యాధిని తట్టుకోగల బ్రూడ్‌స్టాక్‌ను ప్రవేశపెట్టాలని సిఫార్సు చేశారు. సంస్థాగత రుణాల అందుబాటు పరిమితంగా ఉండటం ఒక ప్రధాన అడ్డంకిగా పేర్కొన్నారు. ఆక్వాకల్చర్ కార్యకలాపాలకు కూడా వ్యవసాయం తరహాలోనే ఆదాయపు పన్ను మినహాయింపులు ఇవ్వాలని కోరారు. ఉత్పాదకత, లాభదాయకతను పెంచడానికి మెరుగైన శాస్త్రీయ నిర్వహణ పద్ధతులు, సామర్థ్య పెంపు అవసరమని రైతులు చెప్పారు. ఉత్పత్తి వ్యయంలో దాదాపు 70 శాతం చేపల ఆహారానికే ఖర్చవుతుందని, వీటి నాణ్యతను మెరుగుపరచాలని కోరారు. ఐఓటీ ఆధారిత సాంకేతికతలను అవలంబించడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, ఆ సాంకేతిక పరికరాల వినియోగం సాధ్యపడాలంటే రాయితీలు అందించాలని కోరారు.

'ఉత్తమ ఎగుమతుల నగరం'గా భీమవరం గుర్తింపు పొందినప్పటికీ, వ్యవసాయ క్షేత్రాల నుంచి ప్రాసెసింగ్ కేంద్రాల వరకు అనుసంధానం వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపరచాల్సిన అవసరం ఉందని సముద్రపు ఆహార ఎగుమతిదారులు సూచించారు. పెరుగుతున్న రవాణా సుంకాలు, అధిక విలువ జోడింపు కోసం ఉప-ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం, పోటీ ప్రపంచ మార్కెట్లలో యూనిట్ ధరలను పెంచడానికి పరిమిత అవకాశాలు ఉండటంపై ఆందోళన వ్యక్తం చేశారు.

సమీక్షా సమావేశం అనంతరం పశ్చిమ గోదావరి జిల్లా కల్లా గ్రామంలోని శ్రీ అల్లూరి మహేష్ రాజుకు చెందిన 40 ఎకరాల రొయ్యల చెరువును కేంద్ర మత్స్యశాఖ కార్యదర్శి సందర్శించారు. పీఎంఎంఎస్‌వై కింద అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇక్కడ లిటోపెనియస్ వన్నమేయి రొయ్యల సాగు జరుగుతోంది. 2026 జనవరిలో ఎకరాకు 50,000 విత్తనాల సాంద్రతతో ప్రారంభించిన ఈ క్షేత్రంలో.. ఐఓటీ సెన్సార్లు, నానో-బబుల్ ఆక్సిజనేషన్, విద్యుత్ పర్యవేక్షణ వ్యవస్థలను ఉపయోగిస్తున్నారు. దీని ద్వారా స్థానిక ఉపాధిని కల్పిస్తూనే, 50 టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేస్తున్నారు.

దేశ సముద్ర ఆహార ఎగుమతులు బలమైన వృద్ధిని కనబరుస్తున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 62,408 కోట్లుగా ఉన్న ఎగుమతులు.. 2025-26 నాటికి సుమారు రూ..68,000 కోట్లకు చేరుకుంటాయని అంచనా. ఈ వృద్ధిని ప్రోత్సహించడానికి, కొత్త ఎగుమతి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక ఆర్థిక మండలిలో మత్స్య సంపద స్థిరమైన వినియోగం నిబంధనలు 2025ను ప్రకటించింది. అలాగే భారతీయ నౌకలు అంతర్జాతీయ జలాల్లో చేపల వేట సాగించేందుకు మార్గదర్శకాలను విడుదల చేసింది. దీనితో ప్రత్యేక ఆర్థిక మండలం, అంతర్జాతీయ జలాల నుంచి సేకరించిన చేపలకు సుంకం లేని వెసులుబాటు కల్పించడం, విదేశీ రేవుల్లో దిగుమతి చేసుకునే సరుకును కూడా ఎగుమతులుగా గుర్తించడం, ప్రాసెసింగ్ కోసం అవసరమైన ముడి పదార్థాలపై సుంకం లేని దిగుమతి పరిమితిని 1 శాతం నుంచి 3 శాతానికి పెంచడం వంటి చర్యలు భారత సముద్ర ఆహార రంగాన్ని ప్రపంచవ్యాప్తంగా మరింత బలోపేతం చేస్తున్నాయి.

దేశీయ మత్స్య రంగంలో ఉప్పునీటి ఆక్వాకల్చర్ కీలక పాత్ర పోషిస్తోంది. ఇది దేశంలోని మొత్తం చేపల ఉత్పత్తిలో సుమారు 15 శాతం వాటాను కలిగి ఉంటూ.. రొయ్యల వంటి ఖరీదైన జాతుల సాగుపై దృష్టి సారించడం వల్ల ఎగుమతి ఆదాయంలో సింహభాగాన్ని అందిస్తోంది. తీరప్రాంతాలు, నదీముఖ ప్రాంతాల్లో కేంద్రీకృతమైన ఈ సాగు ఆధునిక సాంకేతికత, శాస్త్రీయ నిర్వహణ పద్ధతులు, బలమైన మార్కెట్ అనుసంధానాల మద్దతుతో ఉత్పాదకతను పెంచడమే కాకుండా వేలాది మందికి ఉపాధిని కల్పిస్తోంది.

ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్న భీమవరం ఉప్పునీటి క్లస్టర్ దేశంలోనే అతిపెద్ద, అత్యంత కీలకమైన సాగు ప్రాంతంగా నిలుస్తోంది. 2025 మార్చి 11న పీఎంఎంఎస్‌వై కింద గుర్తించిన ఈ క్లస్టర్.. సుమారు 53,861 హెక్టార్లలో 42,000కు పైగా చెరువులతో విస్తరించి ఉంది. అనుకూలమైన వాతావరణం, ఆధునిక మౌలిక సదుపాయాల కారణంగా ఇక్కడ ఎగుమతి ఆధారిత రొయ్యల జాతులైన తెల్ల రొయ్య, టైగర్ రొయ్యల సాగు ముమ్మరంగా సాగుతోంది. హెక్టారుకు సగటున 8 టన్నుల దిగుబడితో, జాతీయ సగటు కంటే ఎక్కువ ఉత్పాదకతను సాధిస్తున్న ఈ క్లస్టర్ భారత సముద్ర ఆహార ఎగుమతుల్లో కీలక పాత్ర పోషిస్తోంది.

ఇది దేశంలోని మొత్తం చేపల ఉత్పత్తిలో దాదాపు 30 శాతం వాటాను కలిగి ఉండటమే కాకుండా, చేపల ఉత్పత్తిలో జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలుస్తోంది. ఈ రంగం సుమారు 16.5 లక్షల మందికి జీవనోపాధిని కల్పిస్తోంది. భారతదేశ సముద్ర ఆహార ఎగుమతుల్లో ఏపీ వాటా దాదాపు 34 శాతం కాగా, వీటి వార్షిక విలువ రూ. 21,000 కోట్లకు పైమాటే. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 7.6 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో సాగవుతున్న ఆక్వాకల్చర్.. 2.75 లక్షల మందికి పైగా రైతులకు ఉపాధి కల్పిస్తుంది.

ఎగుమతి ఆధారిత రొయ్యల సాగుకు, ఆక్వాకల్చర్ వ్యవస్థకు భీమవరం వంటి క్లస్టర్లు వెన్నెముకగా నిలుస్తున్నాయి. మత్స్య రంగ బలోపేతానికి పీఎంఎంఎస్‌వై కింద రూ. 2405 కోట్లు, మత్స్య మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి కింద రూ. 450 కోట్ల నిధులు కేటాయించారు. అదే విధంగా పీఎంఎంకేఎస్ఎస్‌వైలో భాగంగా ఎన్ఎఫ్‌డీపీలో 2.83 లక్షల రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ సుస్థిరతను, జీవనోపాధిని బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రత్యేక చర్యలను కూడా అమలు చేస్తోంది. వాతావరణ మార్పులను తట్టుకోగల తీరప్రాంత మత్స్యకారుల గ్రామాల కార్యక్రమం కింద రూ,30 కోట్ల ప్రాజెక్టు వ్యయంతో 15 తీరప్రాంత గ్రామాలను అభివృద్ధి చేస్తున్నారు. అందులో ఇప్పటికే రూ. 7.5 కోట్లు విడుదలవ్వడమే కాకుండా పనులు కూడా ప్రారంభమయ్యాయి.

# మనీలాండరింగ్, ఆర్థిక నేరాలను అరికట్టటానికి ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్-ఇండియా, పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ మధ్య ఎంఓయూ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:మనీలాండరింగ్, ఆర్థిక నేరాలకు వ్యతిరేకంగా భారతదేశ పోరాటాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక ముందడుగులో భాగంగా సమాచార మార్పిడి, పరస్పరం సమన్వయాన్ని పెంపొందించుకునేందుకు ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్-ఇండియా (ఎఫ్ఐయూ-ఐఎన్‌డీ), పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) మధ్య అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది.

పీఎఫ్ఆర్‌డీఏ ఛైర్మన్ శ్రీ శివసుబ్రమణియన్ రమణ్ సమక్షంలో ఎఫ్ఐయూ-ఐఎన్‌డీ డైరెక్టర్ శ్రీ అమిత్ మోహన్ గోవిల్, పీఎఫ్ఆర్‌డీఏ శాశ్వత సభ్యుడు శ్రీ రణదీప్ సింగ్ జగపాల్ ఈ ఎంఓయూపై సంతకాలు చేశారు.

నియంత్రిత, నివేదికలు అందించే సంస్థలకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలను చేపట్టేలా రెండు ఏజెన్సీలను శక్తిమంతం చేయటం ఈ ఎంఓయూ ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగా పీఎఫ్ఆర్‌డీఏ పరిధిలోని సంస్థల మనీలాండరింగ్ నిరోధక, ఉగ్రవాద ఆర్థిక సహాయ నిరోధక (ఏఎంఎల్, సీఎఫ్‌టీ) సామర్థ్యాలను మెరుగుపరచటంపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వ్యవహరించేలా ఇరుపక్షాలు చూసుకుంటాయి. సమాచార మార్పిడి, పరస్పరం ఆసక్తి ఉన్న అంశాలపై చర్చించేందుకు ప్రతీ మూడు నెలలకు సమావేశాలు జరుగుతాయి.

రెండు సంస్థల మధ్య క్రమబద్ధమైన సమన్వయం, పరస్పర చర్చలను సులభతరం చేయటానికి ఈ ఎంఓయూలో భాగస్వాములైన ప్రతీ పక్షం.. ఒక నోడల్ అధికారిని, ఒక ప్రత్యామ్నాయ నోడల్ అధికారిని నియమించాలి.

ఈ ఒప్పందం ఎగ్మాంట్ గ్రూప్ సమాచార మార్పిడి సూత్రాల ద్వారా విదేశీ ఎఫ్ఐయూ సమాచారాన్ని పంచుకోవటంలోనూ సహకరిస్తుంది.

సంబంధిత ఆర్థిక ఉపరంగాల్లోని మనీలాండరింగ్, ఉగ్రవాద ఆర్థిక సహాయ (ఎంఎల్, టీఎఫ్) ముప్పులను, లోపాలను ఈ సహకారం ద్వారా అంచనా వేస్తారు. అనుమానాస్పద లావాదేవీలకు సంబంధించి రెడ్-ఫ్లాగ్ సూచీలను గుర్తించి ప్రచారం చేయటం, పీఎంఎల్ఏ, పీఎంఎల్ నిబంధనలు, పీఎఫ్ఆర్‌డీఏ మార్గదర్శకాల ప్రకారం నివేదికలు అందించే సంస్థల బాధ్యతలను పర్యవేక్షించటం, తనిఖీ చేయటం ఈ సహకారంలో భాగం.

ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్-ఇండియా (ఎఫ్ఐయూ-ఐఎన్‌డీ) గురించి

మనీలాండరింగ్, ఉగ్రవాదానికి నిధుల చేరవేయటాన్ని అరికట్టే ప్రయత్నాలను సమన్వయం చేయటం, అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సమాచారాన్ని స్వీకరించటం, ప్రాసెస్ చేయటం, విశ్లేషించటం, సంబంధిత సంస్థలకు చేరవేయటం వంటి బాధ్యతలను నిర్వహించే కేంద్ర జాతీయ సంస్థ ఎఫ్ఐయూ-ఐఎన్‌డీ.

పీఎఫ్ఆర్‌డీఏ చట్టం-2013 ద్వారా ఏర్పాటు చేసిన చట్టపరమైన నియంత్రణ సంస్థ పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ. జాతీయ పెన్షన్ వ్యవస్థ (ఎన్ పీఎస్), అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) సహా భారత్ లోని పెన్షన్ రంగాన్ని నియంత్రించటం, అభివృద్ధి చేయటం, పర్యవేక్షించటం దీని బాధ్యత.

పెన్షన్ వ్యవస్థ క్రమంగా వృద్ధి చెందటానికి, చందాదారుల ప్రయోజనాలను కాపాడటానికి పెన్షన్ నిధులు, కేంద్ర రికార్డు నిర్వహణ సంస్థలు, ట్రస్టీలు, అగ్రిగేటర్లు, సేవా కేంద్రాల వంటి మధ్యవర్తుల కోసం పీఎఫ్ఆర్‌డీఏ సమగ్ర నియంత్రణ, పర్యవేక్షణా వ్యవస్థను అందిస్తుంది.

## భారత జాతీయ ఏఐ పాలన వ్యూహానికి నాయకత్వం వహించేందుకు కృత్రిమ మేధ పరిపాలన- ఆర్థిక బృందాన్ని (ఏఐజీఈజీ) ఏర్పాటు చేసిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:కృత్రిమ మేధ పాలనా విధానాల అభివృద్ధి, సమన్వయం కోసం దేశపు కేంద్ర సంస్థాగత యంత్రాంగంగా వ్యవహరించే ఉన్నత స్థాయి అంతర్ మంత్రిత్వ శాఖా విభాగమైన కృత్రిమ మేధ పరిపాలన-ఆర్థిక గ్రూపు (ఏఐజీఈజీ)ని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది.

భారత ఏఐ పాలన మార్గదర్శకాలు, ఆర్థిక సర్వేలో చేసిన సంస్థాగత సిఫార్సులకు ఏఐజీఈజీ ఏర్పాటు అధికారిక రూపాన్ని ఇస్తుంది.

కృత్రిమ మేధ ఆధారిత పాలన కోసం ప్రభుత్వంలోని అన్ని మంత్రిత్వ శాఖల సమన్వయంతో కూడిన విధానాన్ని అనుసరించడానికి ఒక అంతర్ మంత్రిత్వ శాఖా విభాగాన్ని ఏర్పాటు చేయాలని ఈ మార్గదర్శకాలు సిఫార్సు చేస్తున్నాయి. మంత్రిత్వ శాఖలు, విభాగాలు, నియంత్రణ సంస్థలు, సలహా సంస్థల చర్యలను ఒక సమగ్ర జాతీయ వ్యూహంతో అనుసంధానించడమే ఈ సంస్థ లక్ష్యం. అలాగే కృత్రిమ మేధ వినియోగాన్ని కార్మిక రంగ వాస్తవ పరిస్థితులతో, సామాజిక స్థిరత్వ ప్రాధాన్యతలతో సరిపోల్చగల సామర్థ్యం కలిగిన ఒక సమన్వయ అధికార సంస్థ అవసరాన్ని ఆర్థిక సర్వే గుర్తించింది.

ఏఐజీఈజీకి ఎలక్ట్రానిక్స్, ఐటీ, రైల్వే, సమమాచార, ప్రసార శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ అధ్యక్షత వహిస్తారు. ఎలక్ట్రానిక్స్, ఐటీ, వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీ జితిన్ ప్రసాద ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. విధాన రూపకల్పన, శాస్త్ర, సాంకేతిక, భద్రత, ఆర్థిక వ్యవహారాల విభాగాలకు చెందిన ఉన్నత స్థాయి ప్రభుత్వ అధికారులు ఈ ఏఐజీఈజీలో సభ్యులుగా ఉంటారు.

దేశ ఏఐ పాలనా యంత్రాంగంలో ఏఐజీఈజీ ఒక అత్యున్నత అంతర్ మంత్రిత్వ శాఖా విభాగంగా పనిచేస్తుంది. దీనికి సాంకేతికత, విధాన రూపకల్పన నిపుణుల కమిటీ మద్దతిస్తుంది. ఈ కమిటీ ఏఐ విధానాలు, పాలనకు సంబంధించిన ప్రపంచవ్యాప్త పరిణామాలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, ప్రమాదాలు, నియంత్రణలతోపాటు ఇతర ప్రాధాన్యత అంశాలపై ఏఐజీఈజీకి నిపుణుల సలహాలను అందిస్తుంది.

# సూర్యాపేటలో కదం తొక్కిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు




సూర్యాపేట, ఏప్రిల్ 17 : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీజీఈజేఏసి తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయ, కార్మిక, పెన్సనర్ల జాయింట్ యక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున నల్లబ్యాడ్జీలు ధరించి మండుటెండను సైతం లెక్క చేయకుండా మధ్యాహ్న భోజన సమయంలో ఉద్యోగులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీజీఇ జేఏసి రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు, ప్రొగ్రాం కన్వీనర్ మట్టపల్లి రాధాకృష్ణ, టీజీఈ జేఏసి జిల్లా చైర్మన్ ఎస్.కె.జానిమియా, సెక్రటరీ జనరల్ భూపాల్, అడిషనల్ సెక్రటరీ జనరల్ తంగెళ్ల జితెందర్ రెడ్డి మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు ప్రధాన సమస్యల పరిష్కారం కోసం టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మండల, డివిజన్, జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు నిరసనలు వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ సమాచారం

పీఆర్సీ ఏర్పాటై 30 నెలలు పూర్తయినందున ప్రభుత్వ ఉద్యోగులకు 51 శాతం ఫిట్‌మెంట్‌తో తెలంగాణాలో 2వ పీఆర్సీ అమలు చేయాలన్నారు. పీఆర్సీ గడువు పొడిగించవద్దని వెంటనే పీఆర్సీ నివేదిక తెప్పించి జూన్ 2 లోపు అమలు చేయాలన్నారు.

అలాగే ప్రభుత్వం రూ.700ల కోట్ల పెండింగ్ బిల్లులు విడుదల చేసినప్పటికి రాష్ట్రంలో నెలకు సగటున 600 మంది ఉద్యోగులు రిటైర్ అవుతుండగా బకాయిలు భారీగా పేరుకుపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏక మొత్తంగా పెండింగ్ లో ఉన్న రూ.1,300 కోట్లను వెంటనే విడుదల చేసి పెన్షనర్ల కుటుంబాల ఇబ్బందులను తొలగించాలన్నారు. కొత్త ఇహెచ్ఎస్ స్కీం విధి విదానాలను వెంటనే రూపొందించి మే 1నాటికి ఉద్యోగులు, పెన్సనర్లకు వైద్య సేవలు అందించేలా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

అలాగే రాష్ట్రంలో కాంట్రీబ్యూషన్ పెన్షన్ ను రద్దు చేసి పాత పెన్సన్ స్కీంను పునరుద్ధరించాలని, 1.9.2004కు ముందు నోటిఫికేషన్ ద్వారా నియమతులైన ఉద్యోగులకు వెంటనే పాత పెన్షన్ స్కీం అమలు చేయాలన్నారు.

వీటితో పాటు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న 64 అంశాలను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి తమ ప్రధాన సమస్యలను పరిష్కరించని పక్షంలో టీజీఇ జెఏసీ తదుపరి కార్యాచరణను ప్రకటిస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో టిజిఇ జేఏసీ కో చైర్మన్లు సోమయ్య, ఆకాష్ వర్మ, అంజయ్య, కృష్ణారెడ్డి, వి.వెంకటేశ్వర్లు, రాంబాబు, జహంగీర్ శ్రీనివాస్, సేక్రటరీ దున్న శ్యామ్, రవికుమార్, యాదగిరి, వెంకటయ్య, గెజిటెడ్ లెక్చరర్ల సంఘం కార్యదర్శి సిహెచ్.కృష్ణ పాల్గొన్నారు.

# ఏ రాష్ట్రానికీ, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలకు ఎటువంటి అన్యాయం జరగదు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:నియోజకవర్గాల పునర్విభజన బిల్లు-2026, రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు- 2026, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు-2026 పై లోక్‌సభలో జరుగుతున్న చర్చలో కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా జోక్యం చేసుకున్నారు. ఈ మూడు బిల్లుల వల్ల లోక్‌సభలో దక్షిణ రాష్ట్రాల ప్రాతినిధ్యం గణనీయంగా తగ్గిపోతుందని, అవి పెద్ద ఎత్తున నష్టపోతాయనే అపోహను వ్యాప్తి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

నియోజకవర్గాల పునర్విభజన బిల్లు-2026 వల్ల దక్షిణ రాష్ట్రాలకు ఎటువంటి నష్టం జరగదని, పైగా మేలు కలుగుతుందని హోం మంత్రి స్పష్టం చేశారు. 50 శాతం పెరుగుదల నమూనా ప్రకారం, లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 543 స్థానాలు 816కు పెరుగుతాయని, దీనివల్ల అన్ని దక్షిణ రాష్ట్రాల స్థానాల సంఖ్య పెరుగుతుందని ఆయన తెలిపారు. లోక్‌సభలో దక్షిణ రాష్ట్రాలకు ప్రస్తుతం ఉన్న 129 స్థానాలు 195కు పెరుగు తాయని, సభలోని మొత్తం స్థానాల్లో వాటి వాటా కూడా దాదాపు 24 శాతం వద్ద స్థిరంగా ఉంటుందని హోం మంత్రి వివరించారు.

ప్రస్తుతం ఉన్న 543 మంది సభ్యుల సభలో కర్ణాటకకు 28 మంది సభ్యులు ఉన్నారని, ఇది మొత్తం స్థానాల్లో సుమారు 5.15 శాతమని హోం మంత్రి చెప్పారు. "ప్రతిపాదిత బిల్లులు రాజ్యాంగ సవరణ ఆమోదం పొందిన తర్వాత కర్ణాటక స్థానాల సంఖ్య 28 నుంచి 42కు పెరుగుతుంది. అప్పుడు 816 మంది సభ్యులు ఉండే లోక్‌సభలో కర్ణాటక ప్రాతినిధ్యం సుమారు 5.14 శాతంగా ఉంటుంది, కాబట్టి కర్ణాటకకు ఎటువంటి నష్టం కలగదు" అని వివరించారు.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 25 స్థానాలు ఉన్నాయని, 543 మంది సభ్యులున్న సభలో ఆ రాష్ట్ర ప్రాతినిధ్యం సుమారు 4.60 శాతంగా ఉందని కేంద్ర హోం మంత్రి తెలిపారు. ప్రతిపాదిత మార్పుల తర్వాత, సుమారు 50 శాతం పెరుగుదలతో ఈ స్థానాల సంఖ్య 38కి పెరుగుతుందని, తద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రాతినిధ్యం సుమారు 4.65 శాతానికి చేరుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా, తెలంగాణకు ప్రస్తుతం 17 స్థానాలు ఉన్నాయని, ప్రస్తుత లోక్‌సభలో ఆ రాష్ట్ర ప్రాతినిధ్యం 3.13 శాతంగా ఉందని చెప్పారు. ప్రతిపాదిత పెరుగుదల తర్వాత, ఆ స్థానాల సంఖ్య 26కు పెరుగుతుందని, దాని ప్రాతినిధ్యం సుమారు 3.18 శాతానికి చేరుకుంటుందని ఆయన వివరించారు.

తమిళనాడు ప్రజల బలం కూడా తగ్గదని, నిజానికి అది పెరుగుతుందని వారికి తాను భరోసా ఇవ్వాలనుకుంటున్నట్లు శ్రీ అమిత్ షా తెలిపారు. తమిళనాడు ప్రాతినిధ్యం క్షీణించదని, బదులుగా అది వృద్ధి చెందుతుందని ఆయన చెప్పారు. ప్రస్తుతం తమిళనాడు నుంచి 39 మంది సభ్యులు ఎన్నికవుతున్నారు. ఇది 543 మంది సభ్యులున్న సభలో సుమారు 7.18 శాతానికి సమానం. ప్రతిపాదిత 50 శాతం పెరుగుదల తర్వాత, స్థానాల సంఖ్య సుమారు 59కి పెరుగుతుందని, 816 మంది సభ్యులు ఉండే కొత్త సభలో ఆ రాష్ట్ర ప్రాతినిధ్యం సుమారు 7.23 శాతంగా ఉంటుందని శ్రీ అమిత్ షా వివరించారు. అందువల్ల, ఈ రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గదని, బదులుగా పెరుగుతుందని స్పష్టమవుతోందని ఆయన పేర్కొన్నారు.

కేరళకు ప్రస్తుతం 20 మంది లోక్‌సభ ఎంపీలు ఉన్నారని, 543 మంది సభ్యులున్న సభలో ఇది సుమారు 3.68 శాతమని హోం మంత్రి తెలిపారు. ప్రతిపాదిత పెరుగుదల తర్వాత, ఈ సంఖ్య 20 నుంచి 30కి పెరుగుతుందని, ప్రాతినిధ్యం సుమారు 3.67 శాతంగా స్థిరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

దక్షిణ భారతదేశం మొత్తం ప్రాతినిధ్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ప్రస్తుతం 543 మంది సభ్యుల సభలో దక్షిణ రాష్ట్రాల నుంచి 129 మంది ఎంపీలు వస్తున్నారని, ఇది సుమారు 23.76 శాతమని శ్రీ అమిత్ షా తెలిపారు. ప్రతిపాదిత 50 శాతం పెరుగుదల తర్వాత, ఈ సంఖ్య 129 నుంచి 195కి పెరుగుతుందని, 816 మంది సభ్యులుండే సభలో వారి ప్రాతినిధ్యం సుమారు 23.87 శాతం, అంటే దాదాపు 24 శాతంగా ఉంటుందని చెప్పారు. దీనిని బట్టి దక్షిణ రాష్ట్రాల మొత్తం ప్రాతినిధ్య బలం పెరుగుతుందని స్పష్టమవుతోందని ఆయన పేర్కొన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర మంత్రిమండలి కుల గణనను నిర్వహించాలని నిర్ణయించిందని, రాబోయే జనాభా గణనలో కులానికి సంబంధించిన గణాంకాలను కూడా సేకరిస్తామని శ్రీ అమిత్ షా తెలిపారు. జనాభా గణన రెండు దశల్లో జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. మొదట ఇళ్ల జాబితా నమోదు, ఆ తర్వాత వ్యక్తుల వివరాల సేకరణ జరుగుతుందని, ప్రస్తుతం ఇళ్ల లెక్కింపు జరిగే మొదటి దశ కొనసాగుతోందని, ఇళ్లకు కులం ఉండదు కాబట్టి ఈ దశలో ఫారమ్‌లో కులం తెలిపే అవకాశం లేదని ఆయన స్పష్టం చేశారు. జనాభా గణన దశలో వ్యక్తుల వివరాలను సేకరించేటప్పుడు కులానికి సంబంధించిన సమాచారాన్ని కూడా నమోదు చేస్తామని హోం మంత్రి వెల్లడించారు.

ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ చట్టంలో ఎలాంటి మార్పులు చేయలేదని, ప్రస్తుతం ఉన్న నిబంధనలనే యథాతథంగా కొనసాగించిందని శ్రీ అమిత్ షా తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ చట్టంలో ఎటువంటి మార్పులు చేయలేదని, చట్టంలోని ఫుల్‌స్టాప్‌లు, కామాలతో సహా పాత చట్టాన్ని అలాగే పునరావృతం చేశామని ఆయన పేర్కొన్నారు. గతంలో ఈ చట్టాన్ని ఏదైనా అవకతవకలకు ఉపయోగించి ఉంటే తాను దానిపై స్పందించలేనని, అయితే ప్రస్తుత ప్రభుత్వం మాత్రం అలాంటి ప్రయత్నం ఏదీ చేయలేదని ఆయన స్పష్టం చేశారు. పునర్విభజన కమిషన్ నివేదిక పార్లమెంటు ఆమోదం పొంది, రాష్ట్రపతి ఆమోద ముద్ర వేసిన తర్వాతే అమలులోకి వస్తుందని హోం మంత్రి స్పష్టం చేశారు. కాబట్టి, 2029 కంటే ముందు ఈ ప్రక్రియ అమలులోకి వచ్చే ప్రసక్తే లేదని శ్రీ అమిత్ షా తెలిపారు. తమిళనాడులో గానీ లేదా పశ్చిమ బెంగాల్‌లో గానీ ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలపై ఈ చట్టం ఎటువంటి ప్రభావం చూపదని ఆయన పేర్కొన్నారు. 2029 వరకు జరగబోయే అన్ని ఎన్నికలు ప్రస్తుతం ఉన్న స్థానాల ప్రకారం, ప్రస్తుత పద్ధతిలోనే ఉంటాయని హోం మంత్రి స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్యంలో అధికారం అనేది కేవలం రాజకీయ పార్టీలు లేదా నాయకుల ద్వారా కాకుండా, పౌరుల అభీష్టం, ఆలోచనల ద్వారా నిర్ణయమవుతుందని శ్రీ అమిత్ షా అన్నారు. 130 కోట్ల మంది ప్రజల తీర్పును ఎవరూ తారుమారు చేయలేరని, అదే సాధ్యమైతే గతంలో ప్రభుత్వ మార్పులు జరిగేవి కావని ఆయన పేర్కొన్నారు. భారతదేశంలో అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) సమయంలో కూడా ప్రజాభిప్రాయాన్ని శాశ్వతంగా ప్రభావితం చేయలేకపోయారని, ప్రజలు తమ తీర్పును ప్రజాస్వామ్య మార్గాల ద్వారానే వెల్లడించారని ఆయన చెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని అంతం చేసే శక్తి ఎవరికీ లేదని, అటువంటి ప్రయత్నాలు జరిగినప్పుడల్లా ప్రజలు వాటిని తిరస్కరించారనడానికి చరిత్రే సాక్ష్యమని శ్రీ అమిత్ షా స్పష్టం చేశారు.

## పల్లె దవాఖాన డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ మహేందర్ ఎన్నిక

నల్గొండ, ఏప్రిల్ 17: తెలంగాణ పల్లె దవాఖాన డాక్టర్స్ అసోసియేషన్ ఎన్నికలను అసోసియేషన్ సభ్యులు ఆన్ లైన్ ఓటింగ్ తో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడిగా ధర్మసాగర్ పల్లె దవాఖాన వైద్యాధికారి డాక్టర్ మహేందర్ అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలుపొందినట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి గా డాక్టర్ ఎస్.సంగీత ఎన్నికై య్యారు. అసోసియేషన్ ఎన్నికల లో అధ్యక్షుడిగా డా. పుట్ట మహేందర్ రావు 977 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. భారీ ఆధిక్యంతో గెలుపొందడం సంఘ సభ్యుల నమ్మకానికి నిదర్శనమని మహేందర్ రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పల్లె దవాఖాన వైద్యుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, వ్యవస్థ అభివృద్ధి కోసం మరింత బలమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తున్నట్టు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు కలిసికట్టుగా ముందుకు సాగుతూ పల్లె దవాఖాన వ్యవస్థను మరింత బలోపేతం చేసి, ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. ఈ ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మొదటిసారిగా ఆన్‌లైన్ విధానంలో విజయవంతంగా నిర్వహించిన ఎన్నికల కమిషన్ డాక్టర్ దశ్రత్ నాయక్, డాక్టర్ జైపాల్ రెడ్డి, ఎలక్షన్ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తన ఎన్నికకు మద్దతు తెలిపిన ప్రతి వైద్యుడికి ధన్యవాదాలు ప్రకటించారు.

## ఏసీబీ వలలో బిచ్కుంద ఎక్సైజ్ సీఐ..రూ.2లక్షలు లంచం తీసుకుంటూ పట్టివేత

నిజామాబాద్, ఏప్రిల్ 17:కామారెడ్డి జిల్లా బిచ్కుంద ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ ఇంటిపై ఏసీబీ అధికారులు దాడులు చేశారు. బిచ్కుందలోని అద్దె ఇంట్లో ఉంటున్న సీఐ బాధితుడి నుంచి రూ.2 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

కల్లు దుకాణం మరో గ్రామానికి తరలింపునకు అనుమతులు, కేసులు నమోదు చేయవద్దని కోరగా ప్రతిఫలంగా ఎక్సైజ్ సీఐ దీను సత్యనారాయణ లంచం డిమాండ్ చేశాడు.

దీంతో బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో సీఐ ఇంటిపై దాడి చేసి పట్టుకున్నారు. అదేవిధంగా అతని వద్ద అదనంగా లభించిన రూ.45,670లను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ అధికారులు వివరించారు. సీఐపై కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరుపరిచినట్లు వెల్లడించారు.

# మాదారంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



ఖమ్మం, ఏప్రిల్ 17: ఖమ్మం జిల్లా సింగరేణి(కారేపల్లి) మండల పరిధిలోని మాదారం గ్రామంలో కారేపల్లి విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. మొదటిసారిగా ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ను నెలకొల్పడం అందరూ హర్షించదగ్గ విషయమన్నారు. రైతులు పండించిన పంటకు సరైన ధరలు అందించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మధ్యవర్తుల బాధలు లేకుండా రైతులకు నేరుగా లాభం చేకూరే విధంగా ఈ కేంద్రం పని చేస్తుందని తెలిపారు. మొక్కజొన్న క్వింటాలుకు మద్దతు ధర రూ.2,400 ప్రభుత్వం ప్రకటించిందని వెల్లడించారు.

ఈ కొనుగోలు కేంద్రం ద్వారా మాదారంతో పాటు పరిసర ప్రాంతాల రైతులు ఇక్కడ మొక్కజొన్నలు అమ్ముకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ అధికారి బట్టు అశోక్ కుమార్, సీఐ నూనావత్ సాగర్, ఎస్ఐ బైరు గోపి, విద్యుత్ ఏఈ వెంకన్న, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల మంజుల, ఐకేపీ ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు, సొసైటీ మాజీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, మాదారం, కొత్తతండా సర్పంచ్ అజ్మీరా ఉమా, ధారావత్ మంగీలాల్ తో పాటు వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు, మండల, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## స్వచ్ఛతా పఖ్‌వాడా-2026 సందర్భంగా న్యాయ విభాగం ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాల నిర్వహణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: స్వచ్ఛతా పరిరక్షణ పక్షోత్సవాన్ని ('స్వచ్ఛతా పఖ్‌వాడా-2026'ను) 2026 ఏప్రిల్ 1 మొదలు ఏప్రిల్ 15 వరకు పాటించిన సందర్భంగా, అనేక కార్యక్రమాలను న్యాయ విభాగం నిర్వహించింది. దీన్లో భాగంగా, డిపార్ట్‌మెంటులోని అధికారులతో పాటు ఉద్యోగుల వ్యక్తిగత జీవితంలో, వృత్తి జీవితంలో ఆరోగ్యం, శారీరక పరిశుద్ధత, మానసిక సంతులతలకు సంబంధించిన అవగాహనని పెంపొందింప చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు.

యోగాను సిబ్బంది జీవన సరళిలో ఒక ముఖ్య భాగంగా చేర్చుకొనే దిశగా ప్రోత్సహించడానికి ఈ నెల 2న అరగంట సేపు యోగా కార్యక్రమాన్ని డిపార్ట్‌మెంటు నిర్వహించింది. వారు స్వీయ జీవితంలోనే కాకుండా పని ప్రదేశంలో కూడా స్వచ్ఛత కి, శారీరక పరిశుద్ధతకి, పొందికైన జీవన విధానానికి ప్రాధాన్యాన్ని ఇస్తామంటూ తమ నిబద్ధతను మరోసారి స్పష్టం చేయాల్సిందిగా వారికి విజ్ఞప్తి చేశారు.

పరిశుభ్రత, శారీరక పరిశుద్ధతలపై వారు తమ ఆలోచనలను వెల్లడించేందుకు అవకాశాన్ని కల్పిస్తూ అధికారులకు, ఉద్యోగులకు ఈ నెల 9న వ్యాస రచన పోటీని నిర్వహించారు.

ఈ నెల పదో తేదీన జైసల్మేర్ భవనం ఆవరణలో శ్రమదానాన్ని కార్యదర్శి (న్యాయం) శ్రీ నీరజ్ వర్మ మార్గదర్శకత్వంలో నిర్వహించారు. ఆ తరువాత, మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అధికారులు వారి ఇళ్ల సమీప ప్రాంతాల్లో లేదా మరేదైనా తగిన ప్రదేశంలో మొక్కలను పెంచి పర్యావరణంలో పచ్చదనాన్ని ప్రోత్సహించేటట్లు ప్రేరణనందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వచ్ఛ, హరిత, సుస్థిర పర్యావరణాన్ని ప్రోత్సహించడం కోసం నిరంతర ప్రాతిపదికన ప్రయత్నాలు కొనసాగించడం ముఖ్యమని శ్రీ నీరజ్ వర్మ స్పష్టం చేశారు.

న్యాయ విభాగం (డీఓజే) అధికారులకూ, అధికారుల పిల్లలకూ ఈ నెల 10న ఒక చిత్రలేఖన పోటీని ఏర్పాటు చేశారు. బాలలు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వారిలో ఈ కార్యక్రమం గొప్ప స్ఫూర్తిని నింపింది.

# డోపింగ్ ఇప్పుడు కేవలం ఒక వ్యక్తిగత చర్య కాదు...

## అదొక వ్యవస్థీకృత బహుళజాతి సంస్థగా మారింది: డా॥ మాండవియా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17: ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ యాంటీ–డోపింగ్ ఇంటెలిజెన్స్, ఇన్వెస్టిగేషన్స్ నెట్‌వర్క్ (జీఏఐఐఎన్) ముగింపు సమావేశ ప్రారంభోత్సవంలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన... స్వచ్ఛమైన క్రీడలు, డోపింగ్‌ను ఎదుర్కోవడంలో సహకారంపై భారత్ కు ఉన్న బలమైన నిబద్ధతను వివరించారు.

అంతర్జాతీయ సహకార ప్రాముఖ్యత గురించి కేంద్ర మంత్రి తెలిపారు. 'దేశాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడంలో 'ప్రపంచ డోపింగ్ వ్యతిరేక నిఘా, విచారణ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుంది' అని పేర్కొన్నారు. ఈ సదస్సు ప్రపంచవ్యాప్తంగా డోపింగ్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న కీలక భాగస్వాములను ఒకచోట చేర్చిందని ఆయన అన్నారు.

సమావేశాన్ని ఉద్దేశించి డాక్టర్ మాండవియా మాట్లాడుతూ భారత్ కేవలం నిబంధనలను పాటించడం కోసమే కాకుండా, క్రీడల పట్ల ఉన్న చిత్తశుద్ధితో చురుకైన సంస్కరణలను అమలు చేస్తోందని అన్నారు.

జాతీయ డోపింగ్ నిరోధక చట్టం 2022ను ఒక పటిష్టమైన శాసనబద్ధ నిర్మాణంగా పేర్కొంటూ 'జాతీయ డోపింగ్ నిరోధక సవరణ చట్టం 2025' నిబంధనలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మార్చిందని తెలిపారు.

నిషేధిత పదార్థాలను సరఫరా చేయడంలో లేదా అక్రమ రవాణా చేసే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని డాక్టర్ మాండవియా స్పష్టం చేశారు.

గతంలో డోపింగ్ నియంత్రణ ప్రయత్నాలు కేవలం ప్రయోగశాల పరీక్షలు, క్రీడాకారుల నిబంధనలకే పరిమితమయ్యేవని డాక్టర్ మాండవీయ గుర్తు చేశారు. అయితే నేడు డోపింగ్ అనేది కేవలం ఒక వ్యక్తి చేసే తప్పు కాదని, అది ఒక వ్యవస్థీకృత బహుళజాతి సంస్థగా మారిందని అని ఆయన అన్నారు. ఇలాంటి వ్యవస్థలను సమర్థవంతంగా నిర్మూలించడానికి ప్రపంచ దేశాలన్నీ సమన్వయంతో స్పందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

బలమైన ప్రపంచ భాగస్వామ్యాల అవసరాన్ని ప్రస్తావిస్తూ వాడా అధ్యక్షుడు విటోల్డ్ బాంకా, "జాతీయ డోపింగ్ నిరోధక సంస్థలు, చట్ట అమలు సంస్థల మధ్య సహకారాన్ని బలోపేతం చేసే విధంగా వాడా తన నిఘా, దర్యాప్తుల నమూనాను అభివృద్ధి చేసింది" అని పేర్కొన్నారు.

"ఈ నమూనా పూర్తిగా భాగస్వామ్యాల మీద ఆధారపడి ఉంటుంది. డోపింగ్ నిరోధక నిపుణుల నైపుణ్యాన్ని, చట్ట అమలు సంస్థల సామర్థ్యాలను ఒకచోట చేర్చుతుంది. దీనికి యూరోపోల్, ఇంటర్‌పోల్ వంటి అంతర్జాతీయ సంస్థల మద్దతు కూడా ఉంది" అని తెలిపారు.

ప్రపంచ వేదికపై భారత్ ఎదుగుతున్న తీరు గురించి కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. .వాడా వర్క్‌షాప్‌లు, ప్రస్తుత సదస్సు వంటి అంతర్జాతీయ కార్యక్రమాలకు ఆతిథ్యం ఇవ్వడం వల్ల మన దేశ దర్యాప్తు సామర్థ్యాలు, డోపింగ్ నిరోధక వ్యవస్థ గణనీయంగా బలోపేతం అయ్యిందని చెప్పారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ సరైన దిశలో, వేగంతో ప్రపంచ క్రీడా శక్తిగా ఎదుగుతోందని తెలిపారు.

మౌలిక సదుపాయాలు, ప్రతిభను గుర్తించడం, శాస్త్రీయ శిక్షణ వంటి క్రీడల అభివృద్ధి రంగాల్లో భారత్ చేస్తున్న పెట్టుబడులను మంత్రి మాండవీయ ఈ సందర్భంగా వివరించారు. ఖేలో ఇండియా, ఫిట్ ఇండియా వంటి కార్యక్రమాలు క్రీడా రంగాన్ని సమూలంగా మారుస్తున్నాయని, తద్వారా క్రీడలు మన జాతీయ గుర్తింపులో అంతర్భాగంగా మారుతునాన్నయని అన్నారు.

నైతిక విలువల ప్రాముఖ్యత గురించి కేంద్ర మంత్రి మాట్లాడుతూ... "క్రీడా నైపుణ్యంలో క్రీడాకారుల విలువలే అత్యంత ప్రధానమైనవి" అని పేర్కొన్నారు. "క్రమశిక్షణను, నిజాయితీని, వ్యక్తిత్వాన్ని పెంపొందించే శక్తి క్రీడలకు ఉందని, కానీ పెరుగుతున్న పోటీ ఒత్తిళ్ల కారణంగా కొన్నిసార్లు అనాలోచిత లేదా అనైతిక నిర్ణయాలకు దారితీయవచ్చు" అని అభిప్రాయపడ్డారు. ప్రతి క్రీడా స్థాయిలోనూ నిష్పక్షపాతాన్ని, నిజాయితీని, గౌరవాన్ని పెంపొందించడం అత్యంత అవసరమని స్పష్టం చేశారు.

నివారణ చర్యల గురించి చర్చిస్తూ... "నివారణే అత్యంత ప్రభావవంతమైన వ్యూహం" అని డాక్టర్ మన్సుఖ్ మాండవీయ తెలిపారు. "సరైన సమయంలో సరైన సమాచారాన్ని కలిగి ఉండటం వల్ల క్రీడాకారులు సరైన నిర్ణయాలు తీసుకోగలరు. దీని వల్ల ఉద్దేశపూర్వకంగా, పొరపాటున చేసే నిబంధనల ఉల్లంఘనలను నివారించవచ్చు" అని అన్నారు. ఒక క్రీడాకారుడి ప్రయాణంలో విద్య, అవగాహన నిరంతరం కొనసాగాలని ఆయన అన్నారు.

భారత జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా)... వర్క్‌షాప్‌లు, సెమినార్లు, డిజిటల్ ప్రచారాలు, క్రీడా ఈవెంట్‌ల ద్వారా అవగాహన కల్పించడం కోసం సమగ్రమైన బహుళ అంచెల విధానాన్ని అనుసరిస్తోందని కేంద్రమంత్రి పేర్కొన్నారు. సార్వత్రిక రూపకల్పన విధానం ద్వారా దివ్యాంగ క్రీడాకారుల కోసం ప్రత్యేక విద్యా మాడ్యూళ్లను రూపొందించినట్లు మాండవీయ వెల్లడించారు.

భారత్ అవలంబిస్తున్న క్రియాశీలక విధానం గురించి క్రీడల శాఖ కార్యదర్శి శ్రీ హరి రంజన్ రావు వివరించారు. "చట్ట అమలు సంస్థలతో సన్నిహిత సమన్వయం, మెరుగైన సమాజార మార్పిడితో సహా... జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ సంస్థాగత, దర్యాప్తు సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి క్రీడల మంత్రిత్వ శాఖ నిరంతరం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా కలుషితమైన లేదా నియంత్రణ లేని పదార్థాల వల్ల కలిగే ప్రమాదాలను అరికట్టడానికి ఎఫ్ఎస్ఎస్ఏఐ (భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ), సీడీఎస్‌ఈఓ (కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ) వంటి సంస్థలతో భాగస్వామ్యం ఎంతో కీలకం. ఇవి ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా పెద్ద సమస్యగా మారాయి'' అని పేర్కొన్నారు.

క్రీడాకారుల కోసం ప్రవేశపెట్టిన సాంకేతిక పరిష్కారాలను మంత్రి ప్రస్తావించారు. "నో యువర్ మెడిసిన్" అనే మొబైల్ యాప్ ద్వారా క్రీడాకారులు తాము వాడే మందులలో నిషేధిత పదార్థాలు ఉన్నాయో లేదో స్వయంగా తనిఖీ చేసుకోవచ్చని తెలిపారు. కలుషితమైన మందుల సమస్యను పరిష్కరించడానికి, క్రీడాకారుల రక్షణ కోసం ప్రముఖ సంస్థలలో అధునాతన పరీక్షా సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

డోపింగ్ పరీక్షలు, అమలులో సాధించిన పురోగతిని డాక్టర్ మాండవీయ వివరించారు. 2019లో సుమారు 4,000గా ఉన్న డోపింగ్ నిరోధక పరీక్షల సంఖ్యను గత ఏడాదిలో దాదాపు 8,000కు పెంచినట్లు తెలిపారు. దీనివల్ల సానుకూల ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. 2019లో 5.6 శాతంగా ఉన్న ఉల్లంఘనల రేటు ప్రస్తుతం 2 శాతం కంటే తక్కువకు పడిపోయిందని ఆయన పేర్కొన్నారు. నిరంతర అవగాహన, నివారణ చర్యల వల్లే ఇది సాధ్యమైందని స్పష్టం చేశారు.

నాడా ఇండియా డైరెక్టర్ జనరల్ శ్రీ అనంత్ కుమార్ దేశపు డోపింగ్ నిరోధక ప్రయత్నాల పరిధిని, పరిణామ క్రమాన్ని వివరించారు. "ఇటీవలి కాలంలో మా పరీక్షా విధానం గణనీయంగా విస్తరించింది. దీనికి తోడు ప్రమాదాల గుర్తింపు, ఫలితాల ఆధారిత విధానాల వైపు మేం మారాము. అయితే కేవలం పరీక్షలు మాత్రమే సరిపోవని గుర్తించి సమగ్రత, నిఘా, విద్యా అవగాహనలను మా డోపింగ్ నిరోధక వ్యవస్థలో ప్రధాన భాగాలుగా చేర్చాం'' అని పేర్కొన్నారు.

పెరుగుతున్న అవసరాలను తీర్చడానికి, జాతీయ డోపింగ్ నిరోధక వ్యవస్థను మరింత బలోపేత చేయడానికి, వాడా ప్రమాణాలకు అనుగుణంగా భారత్ లో కొత్త డ్రగ్ పరీక్షా ప్రయోగశాలలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి వెల్లడించారు.

భారతదేశ నిబద్ధతను తెలియజేస్తూ... "ఏ ఒక్క సంస్థ కూడా ఒంటరిగా డోపింగ్ సవాలును ఎదుర్కోలేదు" అని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రభుత్వాలు, నియంత్రణ సంస్థలు, క్రీడా సంస్థల మధ్య బలమైన భాగస్వామ్యం ఉండాలని చెప్పారు. "భారత్ కేవలం క్రీడల్లో రాణించడం మీదనే కాకుండా.. అత్యున్నత స్థాయి సమగ్రతను కాపాడటానికి కూడా కట్టుబడి ఉంది'' అని పేర్కొన్నారు. క్రీడలు ఎప్పుడూ నిష్పక్షపాతంగా, క్రీడా విలువలకు అనుగుణంగా ఉండేలా చూడటమే మనందరి ఉమ్మడి లక్ష్యానికి ఈ సమావేశం ఒక నిదర్శమని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో వాడా నిఘా, పరిశోధనల డైరెక్టర్ శ్రీ గుంటర్ యంగర్, ఇంటర్‌పోల్ ప్రతినిధి శ్రీ ఫ్రాన్సిస్కో పోర్చుగల్ కూడా పాల్గొన్నారు.

# మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

మంచిర్యాల ఏప్రిల్ 17: మంచిర్యాల సబ్ రిజి,స్టేషన్, స్టాంపుల శాఖ కార్యాలయంలో శుక్రవారం కరీంనగర్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయంలో ఆ శాఖ ఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రికార్డులను పరిశీలించారు. భూ క్రయవిక్రయాల విషయంలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారాల్లో విచారణ చేపట్టినట్లు సమాచారం. సేకరించిన నివేదికను సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ మేరకు విజిలెన్స్ దాడులు జరుగుతాయని ముందస్తు సమాచారం మేరకు సబ్ రిజిస్టర్ కార్యాలయం ఆవరణలోని డాక్యుమెంట్ రైటర్స్ తమ కార్యాలయాలను మూసివేశారు. ఈ దాడుల్లో ఐవోపీలు అనిల్ కుమార్, వరుణ్ ప్రసాద్, ప్రశాంత్ రావు, రవీందర్, ఎమ్మార్వో లు దినేష్ చంద్ర, శ్రీనివాస్, ఏజీ వెంకట్ రెడ్డి, కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రధాత కేసీఆర్ సభను విజయవంతం చేయాలి.. ఎన్ఆర్ఐ రాధారపు సతీష్‌కుమార్




కరీంనగర్, ఏప్రిల్ 16ఉద్యమ నేత, తెలంగాణ రాష్ట్ర ప్రధాత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సభను ప్రజలు విజయవంతం చేయాలని ఎన్నారై బీఆర్ఎస్ బహ్రెయిన్ శాఖ అధ్యక్షుడు రాధారపు సతీష్ కుమార్ పిలువునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చావు నోట్లో తలపెట్టి తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నాన్ని నిజం చేసిన ధీరోధత్తుడు కేసీఆర్ ను ప్రజలు ఆదరించాలన్నారు. శుక్రవారం బహ్రెయిన్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈనెల 20న జరిగే కేసీఆర్ భారీ బహిరంగ సభతో బీఆర్ఎస్ జైత్రయాత్ర మొదలుకానుందని తెలిపారు. తెలంగాణ సమాచారం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సభ అంటేనే కాంగ్రెస్ నాయకులు వణికిపోతున్నారని చెప్పారు. సభకు ఆటంకాలు కలిగించేందుకు కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 30 నెలలు గడుస్తున్న ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తే బీఆర్ఎస్ నాయకులను వేధింపులకు గురి చేస్తూ కేసులు పెడుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించిన మహానాయకుడనే గౌరవం లేకుండా సీఎం రేవంత్ రెడ్డి ఇష్టరీతిలో మాట్లాడుతున్నాడని, తెలంగాణ ప్రజలు అంతా గమనిస్తున్నారని పేర్కొన్నారు.

నాలుగుకోట్ల తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ పాలనను గుర్తు చేసుకొని రేవంత్ పోవాలి, కేసీఆర్ రావాలి అని కోరుకుంటున్నారన్నారు. కేసీఆర్ ప్రసంగం కోసం ప్రజలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ భారీ బహిరంగ సభతో రాష్ట్ర రాజకీయాలు మలుపు తిరగడం ఖాయమన్నారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి తన అనుచరులు వేలాది మందితో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న సందర్భంగా ముందస్తుగా ఎన్నారై బీఆర్ఎస్ బహ్రెయిన్ పక్షాన శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో ఎన్నారై బీఆర్ఎస్ సెల్ ఉపాధ్యక్షుడు బొలిశెట్టి వెంకటేష్, ప్రధాన కార్యదర్శులు మగ్గిడి రాజేందర్, అన్నారం సుమన్, కార్యదర్శులు చెన్నమనేని రాజేందర్, సంగేపు దేవన్న, ఉత్కం కిరణ్ గౌడ్ పాల్గొన్నారు.

# ఉపాధి కార్మికులకు 200 రోజుల పని దినాలు కల్పించాలి

### - వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్యతెలంగాణ సమాచారం



నల్గొండ, ఏప్రిల్ 17:ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం గుర్రంపోడు మండలంలోని కొత్తలపురం, చాంలేరు గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయంలోకి యంత్రాలు రావడంతో వ్యవసాయ కార్మికులకు పని దినాలు తగ్గిపోయాయని, తద్వారా ఉపాధి హామీ చట్టం తప్పా మరొక మార్గం లేదని అందుకోనవే కార్మికులను ఆదుకోవడం కోసం 200 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. గత జనవరి నుండి నేటి వరకు పని చేసిన కూలీలకు వేతనాలు రాకపోవడం మూలంగా తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారని వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎర్రటి ఎండలో పనిచేస్తున్న కార్మికులకు పని ప్రదేశంలో కనీస అవసరాలు అయినటువంటి నీరు నీడ మెడికల్ కిట్టు లాంటి సౌకర్యాలు కల్పించకపోవడం మూలంగా ఇబ్బందులు పడుతున్నారని పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు.

రాష్ట్రంలో 50 లక్షలకు పైగా జాబు కార్డులు ఉన్నాయని కోటి 20 లక్షల మందికి పైగా పేర్లు నమోదు చేసుకొని పని కోసం ఎదురుచూస్తున్నారని ఇందులో 10 శాతం మందికి కూడా పనులు చూపించలేక పోతున్నారని అందరికీ పని కల్పించే పద్ధతులు చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. జిల్లాలో ఉపాధి హామీ పనులు కూలీలందరికీ కల్పించడం లేదని వారానికి కొందరికి మరో వారానికి కొందరికి కల్పిస్తున్నారు. గ్రూపుల వారీగా కాకుండా గ్రామాలలో ఉన్న కార్మికులందరికీ పనులు కల్పించాలని కోరారు.

పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అణుగుణంగా రోజు కూలి రూ.800 కేంద్ర ప్రభుత్వమే ఇవ్వాలని, ముఖ్యంగా ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలనే చిత్తశుద్ధి కేంద్ర ప్రభుత్వానికి ఉంటే రూ.2.50 లక్షల కోట్లు కేటాయించి గతంలో మాదిరిగా వారం వారం డబ్బులు చెల్లించాలన్నారు. గొడ్డలి టెంక గడ్డపారా లాంటి పనిముట్లు అందరికీ అందించాలని, గతం లో మాదిరి గా ఉపాధిలో మేట్లను కొనసాగించాలని ఉపాధి సిబ్బందిని పర్మినెంట్ చేయాలని అలాగే కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విబి జీ రామ్ జీ బిల్లు రద్దుచేసి గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించే పద్ధతుల్లో చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ నెల 21 నుండి మండలాల ముందు జరుగు ధర్నాలలో పెద్ద ఎత్తున వ్యవసా య కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్ల మహేష్, రైతు సంఘం జిల్లా నాయకుడు వనమాల కామేశ్వర్, సిఐటియు మండల కన్వీనర్ పగిడిమర్రి సర్వయ్య, ఫీల్డ్ అసిస్టెంట్లు రఘు, మల్లేశం, ఉపాధి కార్మిక సంఘం చామ్ లేడు గ్రామ అధ్యక్షుడు పిట్టల ప్రేమలత, కార్యదర్శి గుండెబోయిన స్వామి, కొత్తలాపురం గ్రామ అధ్యక్షుడు మెండి తిరుపతయ్య, కార్యదర్శి చామకూరి కవిత, కార్మిక సంఘం నాయకులు నడ్డి కృష్ణయ్య, చామకూరి సాగర్, పగిడిమర్రి నరిత, పగడాల అంతమ్మ, ముడుసు శిరీష, చిలువేరు బక్కయ్య, పగడాల అలివేలు, నిరసనమెట్ల చిన్నయ్య, నడ్డి కృష్ణయ్య, గుడిపల్లి సావిత్రి, నడ్డి రామలింగమ్మ, రావులపాటి ప్రశాంత్, కిలారి అయ్యన్న పాల్గొన్నారు.

# ట్రావెల్స్ బస్సును ఢీకొట్టిన కారు.. చెలరేగిన మంటలు, 9 మంది మృతి



బెంగళూరు, ఏప్రిల్ 17: అదుపుతప్పిన కారు, ట్రావెల్స్ బస్సును ఢీకొట్టింది. దీంతో మంటలు చెలరేగడంతో ఆ రెండు వాహనాలు కాలిపోయాయి. కారులో ప్రయాణించిన ఒకే కుటుంబానికి చెందిన 9 మంది మరణించారు. మృతుల్లో నలుగురు పిల్లలున్నారు. కర్ణాటకలోని యాద్గిర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం సురపూర్ తాలూకాలోని శాంతాపూర్ క్రాస్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక కుటుంబం ప్రయాణిస్తున్న కారు టైర్ పేలిపోయింది. అదుపుతప్పిన ఆ కారు ఎదురుగా వస్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సును ఢీకొట్టింది. ఆ వెంటనే మంటలు చెలరేగాయి. కారు, ట్రావెల్స్ బస్సు పూర్తిగా దగ్ధమయ్యాయి.

కాగా, కారులో ప్రయాణించిన ఒకే కుటుంబానికి చెందిన పది మందిలో 9 మంది మరణించారు. కారులో చిక్కుకున్న ఇద్దరు పిల్లలతో సహా నలుగురు సజీవదహనమయ్యారు. మృతులను కృష్ణ నాయక్ (52), ఆయన భార్య అనంత కళ (45), శరణప్ప (36), ఆయన భార్య నిసర్గ (30), వారి పిల్లలు సిద్ధార్థ (3), అద్విక్ (5), శ్రీనిధి (1.5), శశికళ (30), ఆమె కుమారుడు చందన్ (8)గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. శశికళ మరో కుమారుడైన విరాట్ (10) ఒక్కడే ప్రాణాలతో బయటపడినట్లు చెప్పారు. గాయపడిన ఆ బాలుడ్ని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మరోవైపు కారులో ప్రయాణించిన వారు రాయచూర్ జిల్లాలోని సిర్వార్ తాలూకాకు చెందినవారని పోలీస్ అధికారి తెలిపారు. యాద్గిర్ నుంచి రాయచూర్‌లోని వారి స్వగ్రామానికి కారులో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు చెప్పారు.

అయితే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బెంగళూరు నుంచి కలబురగికి ప్రయాణిస్తున్నది పోలీస్ అధికారి తెలిపారు. ఆ బస్సులోని 20 మంది ప్రయాణికులు క్షేమంగా ఉన్నారని, వారిని సకాలంలో రక్షించినట్లు చెప్పారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# ధోలేరా సెజ్‌లో మొదటి చిప్ తయారీ ప్లాంట్ ఏర్పాటును అధికారికంగా ప్రకటించిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:గుజరాత్‌లోని ధోలేరాలో మెసర్స్ టాటా సెమికండక్టర్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, ఐటీ, ఐటీఎస్ సేవల కోసం ప్రత్యేకంగా సెజ్ ఏర్పాటును ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. సుమారు 66.166 హెక్టార్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న ఈ సెజ్ ద్వారా దాదాపు 21,000 మందికి ఉపాధి లభించనుంది. ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, ఐటీ అనుబంధ సేవలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, కార్య కలాపాలు, రవాణాను సులభతరం చేయటానికి వేగవంతమైన అనుమతుల వ్యవస్థను అందించటానికి ఈ సెజ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇది భారతదేశంలోనే తొలి చిప్ ఫ్యాబ్రికేషన్ ప్లాంట్.గతంలో ప్రత్యేక ఆర్థిక మండలాల (సెజ్) చట్టంలో అభ్యుదయ సంస్కరణలు, నిర్దిష్ట రంగాలకు అనుగుణంగా సెజ్‌ల ఆమోదాల ద్వారా భారత సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యవస్థను బలోపేతం చేయటానికి ప్రభుత్వం పలు కీలక చర్యలు చేపట్టింది.


# ఎన్నికల లబ్ధి కోసం మహిళలను బీజేపీ వాడుకుంటోంది: డీఎంకే ఎంపీ కనిమొళి




న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లును డీఎంకే వ్యతిరేకించింది. ఇవాళ ఆ పార్టీ ఎంపీ కనిమొళిమాట్లాడారు. ఒకవేళ డీలిమిటేషన్ బిల్లు సరైన దశలోనే ఉండి ఉంటే, అప్పుడు ఆ బిల్లును ఎందుకు తమిళనాడు అసెంబ్లీలో ఎందుకు ప్రవేశపెట్టడం లేదని ఆమె ప్రశ్నించారు. డీలిమిటేషన్ అంశంపై ఏ రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రితోనూ కేంద్రం సంప్రదించలేదని ఆమె ఆరోపించారు. 2021లో జనాభా లెక్కలను ప్రభుత్వం వాయిదా వేసిందని, ఇప్పుడు వాటి స్థానంలో పాత జనాభా లెక్కలను తీసుకుంటున్నారని, అయిదు రాష్ట్రాల ఎన్నికలు జరుగుతున్న సమయంలో అకస్మాత్తుగా ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేసినట్లు ఆమె చెప్పారు.

2014లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, రిజర్వేషన్ బిల్లును పాస్ చేయాలని విపక్షాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయని, ఓ రెండు వారాల పాటు ఆగే ఆలోచనలో బీజేపీ లేదని, ఎన్నికల రెస్యూ వ్యూహం తరహాలో మహిళలను బీజేపీ వాడుకుంటున్నదని డీఎంకే ఎంపీ కనిమొళి తెలిపారు. గురువారం లోక్‌సభలో ఎందుకు 2023 నాటి మహిళా రిజర్వేషన్ చట్టాన్ని నోటిఫై చేశారని ఎంపీ ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్‌ను తప్పుదోవ పట్టించే రీతిలో బిల్లు ఉన్నదని, ఇది భారత ఫెడరల్ విధానాన్ని దెబ్బతీస్తున్నట్లుగా ఉందని ఆమె అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నో ప్రామిస్‌లు చేసిందని కానీ అవన్నీ ఢిల్లీ గాలిలో కలిసిపోయినట్లు ఆమె చెప్పారు.

# ఊహాల నుంచి వాస్తవాల వైపు: ఒక మహోన్నత శాస్త్రవేత్త ప్రస్థానం



విశ్వాంతరాళపు గుట్టుమట్లను విప్పి చెప్పిన విజ్ఞాన శిఖరం, ఆధునిక భౌతిక శాస్త్ర గమనాన్ని మలుపు తిప్పిన యుగ పురుషుడు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్. 1879 మార్చి 14న జర్మనీలోని ఉల్మ్ నగరంలో ఒక సామాన్య మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఐన్‌స్టీన్, తన అసాధారణ మేధోశక్తితో ప్రపంచ గమనాన్నే మార్చి వేస్తారని ఆనాడు ఎవరూ ఊహించ లేదు. చిన్నతనంలో పాఠశాల విద్యావిధానంపై ఆయనకు ఉన్న తీవ్ర అసంతృప్తి, సంప్రదాయ పద్ధతుల పట్ల ఆయన చూపిన వైముఖ్యత ఆయనను మందమతిగా చిత్రీకరించేలా చేశాయి. కానీ వాస్తవానికి ఆయన లోపల ఒక అగ్నిపర్వతం లాంటి జిజ్ఞాస దాగి ఉంది. కేవలం పుస్తకాల్లోని సమాచారాన్ని వల్లె వేయడం కంటే, ప్రకృతి రహస్యాలను స్వయంగా శోధించడం, ప్రతి చిన్న విషయాన్ని సందేహించి ప్రశ్నించడం ఆయన సహజ నైజం. స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్ పాలిటెక్నిక్‌లో విద్యనభ్యసించిన కాలంలోనే భౌతిక శాస్త్రంలోని మౌలిక అంశాలపై ఆయనకు అనేక మౌలిక సందేహాలు కలిగేవి. పట్టభద్రుడైన తర్వాత సరైన ఉపాధి దొరకక, స్విస్ పేటెంట్ కార్యాలయంలో ఒక సాధారణ క్లర్కుగా చేరడం ఆయన జీవితంలో ఒక కీలక మలుపు. ఆ సాధారణ ఉద్యోగంలో దరఖాస్తులను పరిశీలిస్తూ దొరికిన ఖాళీ సమయమే ప్రపంచాన్ని మార్చే అద్భుత సిద్ధాంతాలకు గర్భాలయం అయింది. అక్కడ ఆయన చేసిన మేధోమథనం భౌతిక శాస్త్ర పునాదులను పునర్నిర్మించింది.

1905వ సంవత్సరాన్ని భౌతిక శాస్త్ర చరిత్రలో 'అద్భుత సంవత్సరంగా' అభివర్ణిస్తారు. ఆ ఒక్క ఏడాదిలోనే ఐన్‌స్టీన్ ప్రచురించిన నాలుగు పరిశోధనా పత్రాలు విజ్ఞాన శాస్త్ర ప్రాతిపదికలను కదిలించాయి. మొదటగా, కాంతి అనేది కేవలం తరంగం మాత్రమే కాదని, అది ఫోటాన్లు అనే కణాల రూపంలో ప్రయాణిస్తుందని నిరూపించిన 'ఫోటోఎలక్ట్రిక్ ప్రభావం' క్వాంటం భౌతిక శాస్త్రానికి పునాది వేసింది. రెండవది, పరమాణువుల ఉనికిని గణితాత్మకంగా ధృవీకరించిన 'బ్రౌనియన్ చలనం' రసాయన శాస్త్రంలో విప్లవాన్ని తెచ్చింది. మూడవది, కాలం మరియు స్థలం అనేవి విశ్వవ్యాప్తంగా అందరికీ ఒకేలా ఉండవని, అవి వీక్షకుడి చలనంపై ఆధారపడి ఉంటాయని చాటిన 'ప్రత్యేక సాపేక్ష సిద్ధాంతం' అంతరిక్ష పరిశోధనల దిశను మార్చివేసింది.

ఈ పరిశోధనల ఫలితంగానే ప్రపంచంలోనే అత్యంత ప్రసిద్ధ సమీకరణమైన ఇ=ఎంసీ2 ఉద్భవించింది. ద్రవ్యరాశి మరియు శక్తి ఒకదానికొకటి పరస్పర మార్పిడి చెందగలవని, అత్యల్ప పదార్థం నుంచి కూడా అపారమైన శక్తిని జనింపజేయవచ్చని ఈ సూత్రం నిరూపించింది. ఇది అటు అణుశక్తి వినియోగానికి దారితీయగా, ఇటు నక్షత్రాల లోపల నిరంతరం మండే శక్తి వెనుక ఉన్న రహస్యాన్ని విప్పింది. ఈ అద్భుత ఆవిష్కరణలే ఆయనకు 1921లో భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతిని తెచ్చి పెట్టాయి.

ఐన్‌స్టీన్ మేధస్సు ఇక్కడితో ఆగిపోలేదు. 1915లో ఆయన ప్రతిపాదించిన 'సాధారణ సాపేక్ష సిద్ధాంతం' గురుత్వాకర్షణ పట్ల మానవాళికి ఉన్న అవగాహనను సమూలంగా మార్చేసింది. అంతకుముందు న్యూటన్ చెప్పినట్లుగా గురుత్వాకర్షణ అనేది కేవలం రెండు వస్తువుల మధ్య ఉండే ఆకర్షణ శక్తి మాత్రమే కాదని, అది 'స్థలకాల వక్రత' (Curvature of Spacetime) అని ఆయన వివరించారు. అంతరిక్షం అనేది ఒక రబ్బరు దుప్పటి లాంటిదని, భారీ గ్రహాలు మరియు నక్షత్రాలు ఆ దుప్పటిపై ఉంచినప్పుడు ఏర్పడే వంపు వల్లనే ఇతర వస్తువులు వాటి వైపు ఆకర్షించబడతాయని ఆయన నిరూపించారు. 1919లో జరిగిన సూర్యగ్రహణ పరిశీలనల్లో, సూర్యుడి ద్రవ్యరాశి వల్ల కాంతి కిరణాలు వంగి ప్రయాణించడాన్ని శాస్త్రవేత్తలు గుర్తించడంతో ఐన్‌స్టీన్ సిద్ధాంతం అక్షర సత్యమని తేలింది. దీనితో ఐన్‌స్టీన్ ఒక్కసారిగా అంతర్జాతీయ కీర్తిని పొందారు.

ఆయన శాస్త్రీయ విజయాల పక్కన పెడితే, ఐన్‌స్టీన్ ఒక గొప్ప మానవతావాది. జర్మనీలో నాజీల అరాచకాలు పెచ్చుమీరడంతో యూదుడైన ఐన్‌స్టీన్ అమెరికాకు వలస వెళ్లి ప్రిన్స్టన్ యూనివర్సిటీలో తన పరిశోధనలను కొనసాగించారు. యుద్ధాల వల్ల కలిగే వినాశనాన్ని చూసి ఆయన తీవ్రంగా కలత చెందారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో అణు బాంబు తయారీకి దారితీసిన పరిస్థితుల్లో ఆయన సంతకం చేసిన లేఖ పాత్ర ఉన్నప్పటికీ, ఆ తర్వాత జరిగిన జపాన్ నగరాల వినాశనం ఆయనను శాంతి వైపు నడిపించింది. అణుశక్తిని కేవలం మానవ కళ్యాణం కోసమే వాడాలని ఆయన జీవితాంతం ఉద్యమించారు.

ఐన్‌స్టీన్ ప్రభావం కేవలం సిద్ధాంతాలకే పరిమితం కాలేదు; నేడు మనం అనుభవిస్తున్న ఆధునిక సాంకేతికతలో ఆయన ముద్ర ప్రతిచోటా కనిపిస్తుంది. నేటి జిపిఎస్ (GPS) వ్యవస్థలు ఆయన సాపేక్ష సిద్ధాంతం ఆధారంగానే ఖచ్చితమైన సమాచారాన్ని ఇస్తున్నాయి. సెల్ ఫోన్లు, లేజర్లు, సౌరశక్తి ప్యానెళ్లు, టెలివిజన్ కెమెరాలు వంటి అనేక పరికరాలు ఆయన ఫోటోఎలక్ట్రిక్ ప్రభావంపైనే ఆధారపడి పని చేస్తున్నాయి. తన జీవిత కాలంలో 300కు పైగా శాస్త్రీయ పత్రాలను, 150కి పైగా ఇతర తాత్విక రచనలను అందించిన ఐన్‌స్టీన్, "జ్ఞానం కంటే ఊహాశక్తి చాలా గొప్పది" అని నమ్మేవారు. 1955 ఏప్రిల్ 18న ఆయన మరణించినప్పటికీ, ఆయన ప్రతిపాదించిన కృష్ణ బిలాలు (Black Holes), గ్రావిటేషనల్ వేవ్స్ వంటి అంశాలు నేటికీ ఖగోళ శాస్త్రవేత్తలకు కొత్త సవాళ్లను విసురుతున్నాయి. ఆయన జీవితం మనకు ఇచ్చే గొప్ప సందేశం ఏమిటంటే.. ప్రశ్నించడం ఆపకూడదు, సృజనాత్మకతకు సంకెళ్లు వేయకూడదు, విజ్ఞానం ద్వారా మానవతకు సేవ చేయాలి. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ఒక వ్యక్తి కాదు, ఒక విజ్ఞాన శకం. ఆయన వారసత్వం భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలుస్తూనే ఉంటుంది. విజ్ఞాన శాస్త్రాన్ని తాత్వికతతో, మానవత్వంతో జోడించి చూసిన ఆ మహనీయుడు విశ్వం ఉన్నంత కాలం తన అజరామరమైన ఆలోచనల రూపంలో సజీవంగానే ఉంటారు. విజ్ఞాన రంగంలో ఆయన చేసిన కృషిని ఒక వ్యాసంలో బంధించడం సాధ్యం కానప్పటికీ, ఆయన చూపిన బాటలో నడవడం మాత్రం మానవాళికి గర్వకారణం. ఐన్‌స్టీన్ అంటే కేవలం సూత్రాల సమాహారం కాదు, అంతులేని అన్వేషణకు ఆద్యుడు. ఆయన మేధస్సు, వినయం మరియు ప్రపంచ శాంతి పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత ఆయనను ఒక సాధారణ శాస్త్రవేత్త స్థాయి నుంచి యుగప్రవక్త స్థాయికి తీసుకెళ్లాయి. నేటి ఆధునిక ప్రపంచం ఎంత పురోగమించినా, దాని మూలాలు ఎక్కడో ఒక చోట ఐన్‌స్టీన్ మేధో సంపత్తితో అనుసంధానమై ఉంటాయి అనడంలో ఎటువంటి సందేహం లేదు.



-రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

# సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళులు



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 17:(నేటినిజం ప్రతినిధి): భారతదేశ తొలి ఉపరాష్ట్రపతి, ద్వితీయ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త సర్వేపల్లి రాధాకృష్ణన్ 51వ వర్ధంతి సందర్భంగా వేములవాడ పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాధాకృష్ణన్ భారతీయ తత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన జన్మదినమైన సెప్టెంబర్ 5ను దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటామని తెలిపారు. మైసూర్, కలకత్తా విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్‌గా సేవలందించి, తత్వశాస్త్రంలో భారతీయతను చాటిచెప్పారని అన్నారు. 'ఇండియన్ ఫిలాసఫీ', 'ది హిందూ వ్యూ ఆఫ్ లైఫ్' వంటి 150కు పైగా రచనలు చేసి విద్యారంగానికి విశేష సేవలు అందించారని వివరించారు.

1954లో భారత ప్రభుత్వం ఆయనకు అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న ప్రదానం చేయడం ఆయన మహోన్నత సేవలకు నిదర్శనమన్నారు. స్వశక్తితో ఉన్నత శిఖరాలకు ఎదిగిన రాధాకృష్ణన్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, ఏ పనిలోనైనా నిబద్ధతతో ముందుకు సాగాలని ఆయన జీవితం మనకు నేర్పుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్వాడి ఉపాధ్యాయురాలు లిక్కిడి మంజులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ అస్తిత్వాన్ని అవమానిస్తే సహించేది లేదు

## - కూరగాయల కొమురయ్య ఆగ్రహం

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 17:(నేటినిజం ప్రతినిధి): పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన అనుచిత వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కూరగాయల కొమురయ్య తీవ్రంగా ఖండించారు. ప్రత్యేక రాష్ట్రం కోసం కోట్లాది ప్రజలు చేసిన ప్రాణత్యాగాలు, దీర్ఘకాల పోరాటాన్ని కించపరిచేలా మాట్లాడటం బీజేపీ అహంకారానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. చట్టబద్ధంగా, రాజ్యాంగ ప్రక్రియ ద్వారా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని భారత్-పాకిస్తాన్ విభజనతో పోల్చడం అవివేకానికి పరాకాష్ట అని విమర్శించారు. తేజస్వి సూర్య వ్యాఖ్యలు రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువల పట్ల గౌరవం లేనట్టే స్పష్టంగా చూపుతున్నాయని కొమురయ్య పేర్కొన్నారు. తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు గెలిచినా, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా రాష్ట్ర గౌరవాన్ని కాపాడలేకపోవడం సిగ్గుచేటు అన్నారు. నాడు ప్రధాని నరేంద్ర మోదీ నుంచి నేటి వరకు బీజేపీ అగ్రనాయకత్వం తెలంగాణపై వివక్ష చూపుతోందని ఆరోపించారు. విభజన హామీలను అమలు చేయకపోవడమే కాకుండా, ఇప్పుడు రాష్ట్ర ఏర్పాటునే అవమానించడం ప్రజాస్వామ్యానికి విఘాతం అన్నారు. అవగాహన రాహిత్యంతో అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన తేజస్వి సూర్యను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో కూడా తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తే ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయం అని హెచ్చరించారు.

# జై భీమ్ శోభాయాత్ర విజయవంతానికి కృషి చేసిన పుల్కం రాజుకు సన్మానం




రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 17:(నేటినిజం ప్రతినిధి): డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా వేములవాడలో నిర్వహించిన జై భీమ్ శోభాయాత్ర విజయవంతంగా జరగడానికి విశేషంగా కృషిచేసిన వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజును జై భీమ్ శోభాయాత్ర ఉత్సవ కమిటీ సభ్యులు భారత రాజ్యాంగ పుస్తకాన్ని అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నాయకులు మాట్లాడుతూ వేములవాడ డివిజన్ కేంద్రంలో జై భీమ్ శోభాయాత్ర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భీమ్ యాత్ర విజయవంతం కావడానికి మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్ని విధాలుగా సహకరించారని పేర్కొన్నారు. కార్యక్రమం నిర్వహణలో ఆయన అందించిన సహకారం ఎంతో కీలకమైందని తెలిపారు. అలాగే జై భీమ్ శోభాయాత్రలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఉత్సవ కమిటీ సభ్యులు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో నీరేటి శ్రీనివాస్, జింక శ్రీధర్, మూలే కిషోర్, పెంట స్వరుణ్, అక్కి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# 'తక్షణమే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి'

ఖమ్మం, ఏప్రిల్ 17: బూర్గంపహాడ్ మండలంలో ధాన్యం కొనుగోళ్లు తక్షణమే చేపట్టాలని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన బూర్గంపహాడ్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం ఆరబోసిన రైతులు కొనుగోళ్లు చేపట్టకపోవడంతో యార్డు వద్ద తమ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో గత నెలరోజులుగా ముమ్మరంగా వరికోతలు జరుగుతున్నాయని, కోసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో మార్కెట్ యార్డులోనో, రోడ్ల పక్కనో, రైతుల కల్లాల్లోనో ఆరబెట్టుకుని కోనుగోళ్ల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు.


అకాల వర్షాల సంభవిస్తే ఆరుగాలం కష్టించి పండించిన పంట నీటిపాలయ్యే అవకాశం ఉందని, ఈ క్రమంలో పగలనకా రాత్రనకా పంటను కాపాడుకోవాల్సి వస్తుందని అన్నదాతలు తమ ఆక్రందన వ్యక్తం చేశారు. ఇదే అదునుగా భావిస్తున్న దళారులు పండించిన పంటకు సరైన మద్దతు ధర చెల్లించకుండా పలు కారణాలతో తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ తమ కష్టాన్ని దోచుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రోజుల తరబడి ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులతో పాటు బీఆర్ఎస్ నాయకులు కేవీ రమణ ఉన్నారు.

# ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్




ఖమ్మం, ఏప్రిల్ 17:ప్రజలంతా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని, అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్ అన్నారు. శుక్రవారం భద్రాచలంలో పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్- అలైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఎస్పీ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అన్నారు. అలాగే ప్రతి వాహనదారుడు హెల్మెట్ ను ధరించాలని సూచించారు, ప్రతి వాహనదారుడు తగిన ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ ముదిగొండ రామకృష్ణ మాట్లాడుతూ.. హెల్మెంట్ ధరించడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతి, టౌన్ ఎస్ఐ శ్యాం కుమార్, పోలీస్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

# బాల్క సుమన్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఫైర్



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 17:(నేటినిజం ప్రతినిధి): బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రెస్‌విరాట్‌లో బాల్క సుమన్ వ్యాఖ్యలను ఖండించారు. గత పదేళ్లలో వేములవాడ అభివృద్ధి చెందలేదని పుల్కం రాజు విమర్శించారు. ప్రస్తుత ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎన్నికైన తర్వాత రూ.700 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి రూ.150 కోట్లు, రోడ్ల విస్తరణకు రూ.46 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో మూడో బ్రిడ్జి, కలికోట సూరమ్మ ప్రాజెక్టు, మల్కాపేట రిజర్వాయర్, గుడి చెరువు వంటి పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. ప్రస్తుతం వాటిని వేగంగా పూర్తి చేస్తున్నామన్నారు. "అప్పట్లో సమస్యలు పట్టించుకోని వారు ఇప్పుడు విమర్శలు చేయడం తగదు" అని వ్యాఖ్యానించారు. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బాల్క సుమన్ వ్యాఖ్యలను తప్పుబట్టారు. "ప్రజల మధ్య ఉండే మా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌పై విమర్శలు చేయడం సమంజసం కాదు" అన్నారు. బీఆర్ఎస్ హామీలు అమలు కాలేదని, దళితులకు రూ.10 లక్షలు, మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నెరవేరలేదని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం దేవస్థానం అభివృద్ధి, రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను చేపడుతోందన్నారు. "అవాకులు చవాకులు మాట్లాడితే సహించేదిలేదని, చుట్టపు పర్యటనలను ప్రజలు గమనిస్తున్నారు" అంటూ కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# మహిళల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం : డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ

మెదక్, ఏప్రిల్ 17:కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సిద్దిపేట జిల్లా ఏపీ డి సుదీర్ బాబు అన్నారు. శుక్రవారం రాయపోల్ మండల మహిళా సమైక్య భవనంలో నిర్వహించిన ఆధార్, ఐకేపీ కొనుగోలు శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే వారి కుటుంబాలు బాగుపడతాయన్నారు.

ప్రభుత్వం కల్పిస్తున్న ప్రభుత్వ పథకాలను స్వయం సహాయక సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలని అన్నారు. అనంతరం ఉద్యమ ఆధార్ ప్రతి మహిళ చేయించుకునే విధంగా చూడాలని అన్నారు. ఉద్యమ ఆధార్ ద్వారా మహిళలకు బ్యాంకు ద్వారా సూక్ష్మ రుణాలు పొందడానికి ఉపయోగపడతాయని తెలిపారు.

వచ్చే యాసంగి కొనుగోలు కేంద్రాలను పటిష్టంగా నిర్వహించాలని గ్రామ సంఘం అధ్యక్షురాలకు వివోఏలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం, విద్యాసాగర్ , ఏపీ యాదగిరి, ఎమ్మెస్ ఎంఈ మేనేజర్ శిరీష, అసిస్టెంట్ మేనేజర్ రాజు, సీసీలు నాగరాజు, కుమారస్వామి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కవిత, కార్యదర్శి సౌందర్య, గ్రామ సంఘ అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు.

# 'వేతన ఒప్పందం త్వరగా పూర్తి చేయకపోతే ఆందోళన ఉధృతం'

## -ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో కార్మికుల నిరసన

ఖమ్మం, ఏప్రిల్ 17:14వ వేతన ఒప్పంద ప్రక్రియను జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఐఎన్టీయూసీ మిత్రపక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం కార్మిక నాయకులు, కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోనె రామారావు, యారం పిచ్చిరెడ్డి మాట్లాడుతూ 14వ వేతన ఒప్పంద చర్చలు ఆరు నెలలుగా సాగుతున్నా నేటికీ ఒప్పందం పూర్తి చేయకపోవడం దారుణమని మండిపడ్డారు. వేతన ఒప్పందంలో కొత్తగా బోనస్ స్కీమ్‌లు, బీసీటీఎంపీ స్కీమ్‌ల వంటివి లేకపోయినా ఒప్పంద చర్చలు ఇంత సుదీర్ఘకాలంగా సాగడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు.

యాజమాన్యం వేతన ఒప్పంద ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని లేనిపక్షంలో ఐఎన్టీయూసీ మిత్రపక్షాలు ఆందోళన తీవ్రతరం చేస్తుందని హెచ్చరించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**